RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 220 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 సెప్టెంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## నిండుకుండలా తుంగభద్ర జలాశయం..

బెంగళూరు : తుంగభద్ర జలాశయంలోకి రోజురోజుకు ఇన్‌ఫ్లో ఎక్కువై నిండుకుండలా మారుతోంది. జలాశయంలో అత్యధిక ఇన్‌ఫ్లో వుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి 1,08,326 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 59.056 టీఎంసీలు నీరు జలాశయంలో చేరాయి. జలాశయం పైభాగంలోని తుంగ, భద్ర జలాశయాలు నిండి, తీర్థహళ్లి, కొడుగు, మలనాడు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం వుండటంతో అనుకున్న స్థాయికన్నా ఎక్కువగా నీరు చేరుతోంది. ఇప్పటికే రైతన్నలు నాట్లు వేసేందుకు సంసిద్ధులయ్యారు. తుంగభద్ర కాలువ నుంచి సాగునీరు కూడా విడుదల చేశారు. హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ కాలువలకు కూడా జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు.

# ఆ ముఖ్యమంత్రుల జాబితాలో చేరిన తెలంగాణ సీఎం

# రేవంత్ బ్రాండ్.. హైడ్రా!




హైదరాబాద్ : తెలుగు జాతి చరిత్రను ఎన్టీఆర్ కు ముందు.. ఎన్టీఆర్ కు తర్వాత అని చెబుతారు. అప్పటివరకు మదరాసీలుగా ముద్రపడిని తెలుగువారికి 'తెలుగు వారు' అనే గుర్తింపు తెచ్చింది నందమూరి తారకరామారావు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి తెలుగు ఆత్మగౌరవాన్ని ఢిల్లీ స్థాయిలో నిలిపారు ఆయన. తెలుగువాడి సత్తాను దేశమంతా చాటారు అన్న ఎన్టీఆర్. ఇక తెలుగు రాజకీయాల్లోనూ తెలుగుదేశంతో చాలా మార్పు వచ్చింది. అప్పటివరకు కాంగ్రెస్ చేతుల్లో నలిగిన రాష్ట్రానికి కొత్త దారి చూపించారు. ఇక హైదరాబాద్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి.

ఉమ్మడి ఏపీ రాజధాని అయినప్పటికీ.. ఉర్దూ ప్రాబల్యంగా, ఇతర జిల్లాల వారికి పెద్దగా అనుకూలంగా లేని హైదరాబాద్ ను అందరి నగరం చేశారు. నడిబొడ్డున ఉండే అబిడ్స్ లో నివాసం ఉంటూ.. శివారులోని గండిపేటలో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఇక ఎన్టీఆర్ హయాంలోనే కోస్తా జిల్లాల నుంచి హైదరాబాద్ కు ఉపాధి కోసం తరలిరావడం మొదలైంది. అలా వచ్చినవారు వ్యాపార రంగాల్లో రాణించి.. ఉన్నతస్థాయికి ఎదిగారు.

**బాబు వచ్చారు.. రాత మార్చారు...** ఎన్టీఆర్ తర్వాత ఉమ్మడి ఏపీ సీఎం అయినా చంద్రబాబు నాయుడు హైదరాబాద్ ను ప్రపంచ పటంలో నిలిపారు. ఎన్ని విమర్శలు ఉన్నా.. భారీ భవంతులతో సైబరాబాద్ అనే అందమైన నగరం ఇప్పుడు మనకు కనిపిస్తోందంటే దానిని పునాది చంద్రబాబు వేసిందే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బయో టెక్నాలజీ (బీటీ)కి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఐటీ సంస్థలతో పాటు ఫార్మాకూ హైదరాబాద్ రాజధాని అయింది. క్షణం తీరికలేని రోజుల్లో.. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ను 25 ఏళ్ల కిందటే హైదరాబాద్ కు తీసుకొచ్చి.. ఈ నగరం పేరు ప్రపంచమంతా వినిపించేలా చేశారు.

శంషాబాద్ లో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు హైదరాబాద్ నుంచి ఐటీ ఎగుమతులు వేలకోట్లలో జరుగుతున్నాయంటే అంది చంద్రబాబు చేసిన ప్రయత్నమే.

**వైఎస్ ఆర్.. చెరగని ముద్ర...** ఉత్తమ పాలకుడికి ఉండే.. ఉత్తమ లక్షణం .. గత ప్రభుత్వాలు చేసిన మంచిని కొనసాగించడం. 2004 ఉమ్మడి ఏపీకి సీఎం అయిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి అక్షరాలా చేసింది ఇదే. హైదరాబాద్ కు ఏర్పడిన బ్రాండ్ ను ఆయన ఏమాత్రం చెడగొట్టలేదు. సరికదా..? మరింత ఎత్తులకు తీసుకెళ్లారు. భవిష్యత్ అవసరాలను గుర్తెరిగి.. శంషాబాద్ విమానాశ్రయాన్ని చకచకా పూర్తి చేయించారు. ఔటర్ రింగ్ రోడ్ అనే అతిపెద్ద ప్రాజెక్టును చేపట్టారు.

ఇప్పుడది ఎంత అవసరమో తెలిసి వస్తోంది. మరోవైపు ఐటీ ఎగుమతులు అంతకంతకూ పెరిగేలా చూశారు. కొత్తకొత్త సంస్థలను ఆహ్వానించారు. ఉప్పల్ లో అంతర్జాతీయ క్రికెట్ మైదానం నిర్మాణమైంది వైఎస్ హయాంలోనే కావడం గమనార్హం.

**మరింత ముందుకు తీసుకెళ్లిన కేసీఆర్...** ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక హైదరాబాద్ ను ఆణిముత్యంలా చూసుకున్నారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. అత్యధిక ఆదాయం సమకూర్చే రాజధాని నగరంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కుమారుడు, ఐటీ మాజీ ప్రొఫెషనల్ అయిన కేటీఆర్ కు మున్సిపల్, ఐటీ శాఖ అప్పగించి హైదరాబాద్ పై ఫోకస్ పెట్టారు. చురుకైన కేటీఆర్ నాయకత్వంలో.. అమెరికా ఆవల ప్రపంచంలోనే భారీ క్యాంపస్ లకు హైదరాబాద్ కేంద్రమైంది. తరచూ విదేశీ పర్యటనలతోనూ కేటీఆర్ భాగ్యనగరం బ్రాండ్ ను విస్తరింపజేశారు.

**నాలుగో నగరితో రేవంత్ గురి...** రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్).. నాలుగో నగరం (ముచ్చర్ల బేగరి కంచె).. మురికి నదిగా మారిన మూసీ ప్రక్షాళన.. అంటూ హైదరాబాద్ ఇమేజ్ ను పెంచే ప్రయత్నం చేస్తున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. అంతేకాక.. ఒకప్పుడు లేక్ సిటీగా పేరున్న హైదరాబాద్ ఇప్పుడు లేక్ లెస్ సిటీ అవుతున్న ప్రమాదాన్ని గుర్తించారు. దీంతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ను తీసుకొచ్చారు. రంగనాథ్ వంటి సిన్సియర్ ఐపీఎస్ సారథ్యంలో ఇప్పుడు హైడ్రా కలకలం రేపుతోంది. చెరువులను ఆక్రమించి విలాసవంతమైన భవనాలను కట్టుకున్న బడా బాబుల పనిపడుతోంది. ఇదంతా విజయవంతంగా సాగితే.. రేవంత్ కు ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్ తరహాలో బ్రాండ్ ఇమేజ్ తెచ్చే కార్యక్రమమే. వాస్తవానికి హైడ్రా మూడు నెలల కిందట ఏర్పాటైన సమయంలో ఎవరూ ఈ స్థాయిలో పనిచేస్తుందని భావించలేదు. అప్పటికి లోక్ సభ ఎన్నికల హడావుడి కూడా ఉండడం ఓ కారణం. ఇప్పుడు మాత్రం హైడా అంటేనే హడలెత్తిపోతున్నారు. హైదరాబాద్ నగరంలో చెరువు భూముల్లో అక్రమంగా నిర్మించుకున్న కట్టడాల్లో దాదాపు 95 శాతం బడా బాబులవే. వాటిని కూల్చడాన్ని ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారు. పెద్దలను దెబ్బతీయడం ద్వారా పేద, మధ్య తరగతి వర్గాల ముఖ్యమంత్రిగా రేవంత్ ఇమేజ్ సంపాదిస్తున్నరు. కుటుంబ సభ్యులు, సొంత పార్టీ నేతలు, మంత్రులు అన్న తేడాను ఆయన చూపడం లేదు. నిష్పాక్షికత కలిగిన డైనమిక్ సీఎంగా ఇమేజ్ పొందే లక్ష్యంతో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఇదంతా మున్ముందు చరిత్ర తిరగేస్తే సీఎంలలో తనకంటూ పేజీ ఉండాలని రేవంత్ కోరుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది.




హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మధ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం ఇవాళ(శనివారం) ఉదయం వాయుగుండంగా మారింది. దీంతో ఇవాళ, రేపు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం బంగాళాఖాతంలోనే వాయుగుండం కొనసాగుతోంది. ఆదివారం తెల్లవారుజామున కళింగపట్నం, విశాఖపట్నం, గోపాల్ పూర్ తీర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నల్గొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట సహా పలు జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వానలు కురుస్తాయని తెలిపింది. వాయుగుండం తీరే దాటే సమయంలో తెలంగాణలో గంటకు 30నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితేనే బయటకు రావాలని తెలిపింది.


# హైడ్రా తెచ్చిందే నా కోసం!

- తప్పులు దొరికే వరకు అగుతాం అపై ప్రభుత్వంపై పోరాడుతాం
- మాజీ మంత్రి మల్లారెడ్డి వాక్యాలు




బోడుప్పల్: రాష్ట్రంలో అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపుతున్న హైడ్రా తన కోసం తన అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డి కోసం,పల్లా రాజేశ్వర్ రెడ్డి కోసమే తెచ్చారని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వాక్యానించారు.

శనివారం నాడు మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మల్లారెడ్డి అక్కడే ఉన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ తో మాట్లాడుతూ జంగన్న హైడ్రా పేరుతో పేదలపై ప్రభుత్వం ప్రతాపం చూపుతుంది జేర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పేదలకు అన్యాయం జరగకుండా చూడవే అన్న అని అనగా దానికి ప్రతిగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ హైడ్రా ఎవరిని కావాలని ఇబ్బంది పెట్టదు ఆక్రమణ దారులు ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకుంది అందులో ఎవరికి మినహాయింపులు లేవు అని సమాధానం ఇచ్చారు. మద్యలో కలుగజేసుకున్న మల్లారెడ్డి జంగన్న (వజ్రెష్ యాదవ్ ) నాపై ఫిర్యాదులు చేశావ్ కదా అసలు హైడ్రా వచ్చిందే నా కోసం నా అల్లుడు కోసం పల్లా రాజేశ్వర్ రెడ్డి కోసం తెచ్చారు. అయిన మాకు వంద బిల్డింగ్ లున్నాయి అందులో ఒకటి పోతే నాకేమి నష్టం లేదు హైడ్రా మా పని చేస్తే హైడ్రా పని మేము చూసుకుంటామని మల్లారెడ్డి అన్నారు.




# 'హైడ్రా' దెబ్బ కు తలలు పట్టుకుంటున్న రియల్ ఎస్టేట్ యాజమాన్యాలు

హైదరాబాద్ లో హైడ్రా దూకుడుతో రియల్ ఎస్టేట్ యాజమాన్యాలు తలలుపట్టుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో జనాభా పెరిగిపోతుండడంతో ఇష్టాను సారంగా చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జా చేసి అక్రమాలు నిర్మాణాలు చేపడుతున్నారు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇన్నాళ్లూ ఆక్రమణదారులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగింది. కానీ ఇప్పుడు హైడ్రా రావడంతో నగర పరిధిలో చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో బడా ప్రముఖుల అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా..తాజాగా వందలమందికి నోటీసులు జారీ చేసారు.

ఇందులో అధికార పార్టీ నేతలు, సినీ ప్రముఖులు , బిజినెస్ రంగంవారు ఇలా చాలామందే ఉన్నారు. దీంతో ఇప్పుడు కొత్తగా ఫ్లాట్స్ కొనాలంటే కొనుగోలుదారులు భయపడుతున్నారు. ఏ నాలా ఫైన కట్టారో..? ఎప్పుడు నోటీసులు వస్తాయెూ..? అని ఖంగారుపడుతున్నారు. కొత్తగా ఫ్లాట్స్ కొనాలనుకునేవారు తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటుండగా..చెరువులు, నాలాల చుట్టూ నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారు వాటిని రద్దు చేసుకోవడం మొదలుపెట్టారు. అడ్వాన్సులు వెనక్కి తిరిగి ఇచ్చేయాలని డెవలపర్లు, కాంట్రాక్టర్లను కోరుతున్నారు.

ముఖ్యంగా అమీన్పూర్ లేక్, దుర్గంచెరువు, గండిపేట ప్రాంతాల్లో ఈ ఎఫెక్ట్ ఎక్కువగా ఉన్నట్లు చెపుతున్నారు.

హైడ్రా దెబ్బతో రియల్ ఎస్టేట్ ఫై ప్రభావం గట్టిగా పడనుందని అంటున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ భారీగా పడిపోగా..ఇప్పుడు హైడ్రా దెబ్బ తో మరింత పడిపోవడం ఖాయమని భావిస్తున్నారు.

## సంపాదకీయం

# కేసీఆర్ అండ్ జగన్... ఒకే పడవలో ప్రయాణం !

ఇద్దరూ అన్నదమ్ములుగా మెలిగారు. ఇద్దరూ ఒకరి మేలు మరొకరు కోరుకున్నారు. ఏపీలో జగన్ గెలవాలని 2014 నుంచే కేసీఆర్ కోరుకున్నారు అది 2019లో సాకారం అయింది. ఇక 2024లోనూ వైసీపీయే అధికారంలోకి వస్తుందని అక్కడ కేసీఆర్ కేటీఆర్ జోస్యాలు చెప్పారు. కానీ జరిగింది వేరు. మొత్తానికి 2019లో ఏపీలో జగన్ తెలంగాణాలో కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భాయీ భాయీ అన్నట్లుగా మెలిగారు. అలా కొనసాగిన ఈ బంధం ఓటమిలోనూ ఒకటిగానే చేసింది. ఇద్దరూ కొన్ని నెలల తేడాతో ఓటమి పాలు అయ్యారు. సిట్టింగులకు సీట్లు అన్నీ ఇచ్చి కేసీఆర్ ఓడితే. సెట్టింగులను భారీ ఎత్తున తప్పించి జగన్ ఓటమి పాలు అయ్యారు. ఎవరు ఏమి చేసినా ఫలితం మాత్రం ఒక్కటిగానే వచ్చింది. ఇవన్నీ ఇలా ఉంటే ఓటమి తరువాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ ఎస్ పార్టీ అనేక ఇబ్బందులు పడుతోంది. ఆ పార్టీలో ఉన్న వారు, కేసీఆర్ అంటే ఎంతో విధేయత చూపించేవారు అంతా అధికార కాంగ్రెస్ వైపు పరుగులు తీసారు. దానికి తోడు లోక్ సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా దక్కించుకోలేక బీఆర్ఎస్ చతికిల పడింది. ఇక బీఆర్ఎస్ ఏ విధంగా ముందుకు సాగుతుంది అన్నది ఒక చర్చగా ఉంది. ఏపీలో చూస్తే వైసీపీ కూడా అదే తీరులో ఉంది. పార్టీ ఓటమి పాలు అయ్యాక నేతలు అంతా ఒక్కొక్కరుగా జారుకుంటున్నారు. వారు పార్టీని వీడేటప్పుడు చెప్పే మాటలు కేవలం సాకులు అని అర్థం అవుతోంది. అధికారంలోకి తిరిగి వైసీపీ రాకపోవడమే అసలైన కారణం అని కూడా అంటున్నారు. కేసీఆర్ నేతలను పిలిచి పార్టీ మారవద్దు మనకు ఉన్నది మంచి కాలం అని ఎంత నచ్చచెప్పినా చేయాల్సిన పనిని వారు చేస్తున్నారు. ఏపీలో అయితే ఎంత బుజ్జగించినా వెళ్ళిపోయే వారు ఎటూ పోతారు అన్న వైఖరితో వైసీపీ అధినాయకత్వం ఉంది. మొత్తానికి చూస్తే అటూ ఇటూ ఒకే సీన్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి క్యూలు కడుతూంటే ఇక్కడ వైసీపీ నుంచి టీడీపీ వైపు క్యూలు కడుతున్నారు. ఇలా చూసుకుంటే విజయాలల్లోనే కాదు ఇబ్బందులలోనూ బీఆర్ఎస్ కి వైసీపీకి మధ్య ఇంత సారూప్యమా అని అంతా చర్చించుకుంటున్నారు. ఇక్కడ ఈ రెండు పార్టీల పుట్టుక నడక ఒకానొక టైం లో ఆ పార్టీలు చూపిన తీవ్ర రాజకీయ ప్రభావం గురించి కూడా చర్చించుకోవాలి. బీఆర్ఎస్ ఒక ఎమోషన్ నుంచి పుట్టింది. ప్రత్యేక తెలంగాణా అన్న భావోద్వేగ నినాదంతో ఆనాడు టీఆర్ఎస్ ఏర్పాటు అయింది. ఉద్యమ పార్టీగా ఉంటూ రాజకీయాలు చేస్తూ చివరికి లక్ష్యం చేరుకుంది. జనాలు తెలంగాణా రాష్ట్రం తెచ్చినందుకు రెండు సార్లు కేసీఆర్ ని సీఎం గా చేసి రుణం తీసుకున్నారు. ఆ లెక్క సరిపోయింది అని కూడా ప్రజలు భావిస్తూ ఉండవచ్చు అని కూడా విశ్లేషిస్తున్నారు. ఏపీలో చూస్తే వైఎస్సార్ అనే ఒక భావోద్వేగం చుట్టూ అల్లుకుని వైసీపీ పుట్టింది. వైఎస్సార్ కి అయిదేళ్ళ పాటు సరిపడ అధికారం ఇస్తే ఆయన కేవలం మూడు నెలలలోనే ప్రమాదవశాత్తు మరణించడంతో జనాలకు ఆయన మీద ఆ ప్రేమ అభిమానం అలాగే ఉండిపోయాయి. వాటిని ఆయన కుమారుడు జగన్ మీద చూపించారు. తండ్రి వారసుడిగా జగన్ కి చాన్స్ ఇవ్వాలని భావించి ప్రజలు 2014లోనే చాలా వరకూ టర్న్ అయినా విభజన వల్ల ఏపీలో ఏర్పడిన కొత్త రాజకీయంతో అది ఫలప్రదం కాలేదు. కానీ 2019లో జనాలు జగన్ కి పట్టం కట్టి ఆ విధంగా జగన్ రుణం వైఎస్సార్ రుణం తీర్చుకున్నారు. ఈ లెక్కన చూస్తే ఎమోషనల్ బ్యాక్ గ్రౌండ్ గా పుట్టిన బీఆర్ఎస్ జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్ బీజేపీలకు ఒక దశలో ఖంగు తినిపించింది. ప్రాంతీయ పార్టీగా ఉమ్మడి ఏపీలో ఉన్న టీడీపీకి కూడా తెలంగాణాలో మనుగడ లేకుండా చేసింది. అంతలా బీఆర్ఎస్ తన రాజకీయ ప్రతాపాన్ని చూపించింది. ఒక దశలో దాని చుట్టే రాజకీయాలను మొత్తం తిప్పుకుంది. ఇక ఏపీలో చూస్తే అదే పరిస్థితి. వైఎస్సార్ ని కేంద్ర బిందువుగా చేసుకుని వైసీపీ ఏర్పాటు కావడంతో పాటు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు సైతం గల్లంతు చేసి ఏపీలో బలమైన ఒక ప్రాంతీయ పార్టీకే పెను సవాల్ విసిరింది. అయితే ఆ ప్రభంజనం ఆ వెలుగులు ఈ రోజు ఏవీ అన్న చర్చ సాగుతోంది. భావోద్వేగాలతో పుట్టిన పార్టీలు ఒక లక్ష్యం తీరేంతవరకు మనుగడలో ఉంటాయి అని చెప్పడానికి ఈ రెండు పార్టీలే ఉదాహరణ అని అంటున్నారు. రెండు పార్టీలూ ఇపుడు ఉనికి పోరాటం చేస్తున్నాయనే అంటున్నారు. ఈ రెండు పార్టీలకు కొత్త నినాదాలు కావాలి. కొత్త రాజకీయ విధానాలూ కావాలి.

అపుడు కానీ అవి మళ్లీ దూకుడు కొనసాగించలేవు అని అంటున్నారు. ఈలోగా ఆ పార్టీలను ఖాళీ చేసి ఖతం చేయాలని ప్రత్యర్థులు చూస్తున్నారు. సో ఇపుడు చూసుకుంటే కనుక కేసీఅర్ జగన్ ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నారు అని విశ్లేషిస్తున్నారు.

# అలియాబాద్ గ్రామ పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలి : కలెక్టర్ గౌతమ్







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : పల్లె దవఖానాలలో మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తూ, రోగులకు అవసరమైన చికిత్స కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత వైద్య అధికారులకు సూచించారు. శనివారం శామీర్ పేట మండలం అలియాబాద్ పరిధిలోని పల్లె దవకానను జిల్లా కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి పల్లె దవఖాన అందించే వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెదవఖానాను పరిశీలించి రోజుకు ఎంత మంది ఓపి పెషంట్లు వస్తారని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. పల్లె దవఖానాలో ఎంత మంది సిబ్బంది ఉన్నారని, పల్లెదవఖాలలో అందించే వైద్య సేవల రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్ గురించి వాటి నమోదు రిజిష్టర్లను తనిఖీ చేసారు. రిజిష్టర్లలలో నమోదు సరైన విధంగా లేవని, ఎప్పటి రికార్డులను అప్పుడే నమోదు చేయ్యాలని రిజిష్టర్లలలో ఖాళీలు ఉండకూడదని సూచించారు. ఈడిడి క్యాలెండరును , వంద కాలమ్ రిజిష్టరును తప్పనిసరిగా నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ప్రసవాల సంఖ్యను, వ్యాక్సినేషన్ ను పెంచాలన్నారు. లేబర్ రూమ్‌ను పరిశీలించి ప్రసవాలకు అవసరమైన నవీకరణయంత్రాలను తెప్పించుకోవాలని కలెక్టర్ సూచించారు. మందుల గదిని పరిశీలించి మందుల నమోదు రిజిష్టర్లను, పేషంట్లకు మందులు అందించిన రిజిష్టర్లను తనిఖీ చేసి గత నాలుగు నెలలుగా పేషంట్లకు మందులు ఇచ్చిన రికార్డుల నమోదు సరిగా లేదని కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు. రిజిష్టర్ల నిర్వహాణకు తగిన చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను కలెక్టరు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ శామీర్ పేట లోని సామాజిక ఆరోగ్య కేంద్రం ను తనిఖీ చేసి, అక్కడ వైద్య సిబ్బంది ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. పేషంట్లకు అందించే సేవలను మెరుగు పరిచి మరింత విస్తృతం చేయ్యాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో ఉన్న డెంటల్, ల్యాబ్ విభాగాలను పరిశీలించి వాటి పనితీరును డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిని తనిఖీ చేస్తూ ల్యాబ్ రిజిష్టర్లను, రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు ఎన్నిర్యాపిడ్ కిట్లను ఉపయోగిస్తారని, వారానికి కనీసం 1500 కిట్లను ఉపయోగించాలని సూచించారు. లేబర్ రూం పరిశీలించి హైడ్రాలిక్ డెలివరీ టేబుల్ ను తెప్పించుకోవాలని, అందుకు అవసరమైన నిధుల కోసం ప్రణాళిక తయారు చేసి నివేదిక పంపాలని కలెక్టరు తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన మరమ్మత్తులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ రఘునాథస్వామి, శామీర్ పేట ఎంపిడిఓ మమతా బాయి, డాక్టర్ రవీందర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శామీర్ పేటలోని రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించి పరిశీలించిన... కలెక్టర్ గౌతమ్

శామీర్ పేట, (గరుడ వార్త) : అమీనా ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న మహత్మాగాంధీ జ్యోతిబా పూలే, బిసి వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన మౌళిక వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. శనివారం శామీర్ పేట లోని మహత్మాగాంధీ జ్యోతిబా పూలే, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర) ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్కూలులో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని, స్కూలు నిర్వహాకులను అడిగి తెలుసుకున్నారు. స్కూలులో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్ల కు అవసరమైన మరమ్మత్తులు చేయించాలని తెలిపారు. భోజన శాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని, భోజన శాలకు వెళ్లే దారిని మొరం తో





నింపాలని నిర్వహాకులకు కలెక్టరు సూచించారు. వీటికి అయ్యే ఖర్చులను యాజమాన్యానికి ఇచ్చే అద్దెలో 4, 5 నెలల్లో కొంచెం కొంచెంగా మినహాయించాలని నిర్వాహాకులకు తెలిపారు. స్కూలులోని వంట శాలను, స్టోరురూంను కలియ తిరిగి పరిశీలించారు. స్టోరురూంలోని వంట సామాగ్రిని పరిశీలించి తడి లేకుండా సామాగ్రిని నిలువ చేసుకోవాలని కలెక్టరు స్టోర్ ఇంఛార్జిని ఆదేశించారు. తరగతి గదులను కలెక్టరు పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. రెసిడెన్షియల్ స్కూలుకు వెళ్లే రహదారి చాలా గుంతలతో ఉన్నదని, దానికి కావలసిన మరమ్మత్తులను చేపట్టాలని ఎంపిడిఓను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా విద్యార్థులు కలెక్టరుకు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మమతా బాయి, రెసిడెన్షియల్ స్కూలు నిర్వహాకులు, టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్ల సేవలను గుర్తించాలంటూ నిరసన



శామీర్ పేట, (గరుడ వార్త) : అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించి ఇచ్చే నిర్ణయాన్ని ప్రభుత్వం మానుకోవాలని అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు జి. సునీత ప్రభుత్వాన్ని కోరారు. శనివారం శామీర్ పేట సెక్టార్ అంగన్వాడి స్కూల్ వద్ద అంగన్వాడి టీచర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్బంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి . సునీత మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నపిల్లలకు విద్య బోధనను చేస్తూ ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి గత 40 సంవత్సరాలుగా అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. 65 సంవత్సరాలు నిండిన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను జూలై 1 నుంచి విధులకు హాజరు కావద్దని సర్కులర్ జారీ చేయడం జరిగిందన్నారు. వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కు సంబంధించి గత ప్రభుత్వంలో 24 రోజుల సమ్మె సందర్భంగా అప్పుడు ఉన్నటువంటి మంత్రి సంబంధిత అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం టీచర్ కు 2 లక్షలు, హెల్పర్ కు 1 లక్ష రూపాయలు కాకుండా పాత జీవో నెంబర్ 10 ప్రకారమే అంగన్వాడీ టీచర్ కు 1 లక్ష రూపాయలు హెల్పర్ కు 50 వేల రూపాయలు ఇస్తామని సర్క్యులర్ లో పేర్కొన్నారని తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వేలాదిమంది అంగన్వాడి ఉద్యోగులతో చలో హైదరాబాద్ ఐసిడిఎస్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపట్టిన సందర్భంగా కమిషనర్ అంగన్వాడి ఉద్యోగులకు సంబంధించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 2 లక్షలు , హెల్పర్ లకు 1 లక్ష రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని, అదేవిధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీ సాక్షిగా ఇతర అనేక సందర్భాల్లో ప్రభుత్వ మీటింగులు , సమావేశాల్లో సైతం బహిరంగంగా హామీ ఇచ్చి ఇప్పుడు అంగన్వాడీలకు అన్యాయం చేసే విధంగా అధికారులు కొన్ని జిల్లాలలో టీచర్లకు 1 లక్ష రూపాయలు హెల్పర్ కు 50 వేల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బులను అకౌంట్ల లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే మానుకొని అంగన్వాడి ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 2 లక్షలు, హెల్పర్ లకు 1 లక్ష రూపాయలు అందించాలని కోరారు. లేని పక్షంలో సిఐటియు అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# రవాణా కేంద్రాలు.. దళారులు రాజ్యాలు

హైదరాబాద్ : గ్రేటర్‌లోని రవాణాశాఖ కార్యాలయాల వద్ద దళారుల ప్రమేయం మరోసారి తేటతెల్లమైంది. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి నిరోధక శాఖ మంగళవారం చేపట్టిన దాడుల్లో భాగంగా గ్రేటర్‌లోని బండ్లగూడ, మలక్‌పేట్, టోలిచౌకి, మణికొండ కార్యాలయాల్లో దళారుల దందా బయట పడింది. నాలుగు కార్యాలయాల్లో రూ. 1.37 లక్షలు లెక్క చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదంతా దరఖాస్తుదారుల నుంచి దళారులు వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది. ఇలా అన్ని కార్యాలయాల్లో నెలలో రూ.కోట్లలోనే అనధికారిక లావాదేవీలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఆర్టీఏలు వాటి పరిధిలో ఉప రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. దాదాపు అన్ని కార్యాలయాల వద్ద దళారుల దందా అనేది బహిరంగ రహస్యమే.

రెట్టింపు ఛార్జీల వసూలు: రిజిస్ట్రేషన్ చేయించడం, వాహన యాజమాన్య హక్కుల మార్పిడి, కొత్త లైసెన్సులు ఇప్పించడం తదితర సేవలకు దళారులు రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇందులో కొంత అక్కడ సిబ్బందికి వాటాలుగా పంపుతున్నారు. ఇలా సాయంత్రానికి ఎవరివి వారికి అందుతుంటాయి. వాస్తవానికి ఆర్టీఏలో 43 రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందే అవకాశం రవాణాశాఖ కల్పించింది. అయితే కొన్ని రకాల సేవలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా కార్యాలయాలకు రావాల్సిందే.

ఏసీబీని చూసి... పర్సు వదిలేశారు..

మలక్‌పేటలోని ఈస్ట్ జోన్ ఆర్టీఏ కార్యాలయంలో సోదాల సందర్భంగా దరఖాస్తుదారులను విచారించి పంపించి వేయగా...15 మంది దళారులను గుర్తించారు. ఉద్యోగుల టేబుళ్లు, డెస్క్‌లు, దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక గుర్తు తెలియని పర్సు ఏసీబీకి లభించింది. అందులో రూ. 22 వేలు ఉన్నాయి. అనంతరం ఏసీబీ డీఎస్పీ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీఏ కార్యాలయంలో పలు అవకతవకలు జరిగాయని గుర్తించామని వివరించారు. పలువురు ఏజెంట్లు, బ్రోకర్లు కార్యాలయంలో ఉన్నారని.. పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పరుగో పరుగు...

దాడుల సందర్భంగా పలువురి ఏజెంట్ల వద్ద డబ్బులు పట్టుబడ్డాయి. బండ్లగూడలో రూ. 48,370, మలక్‌పేట్‌లో రూ. 22 వేలు, టోలిచౌకిలో రూ. 43,360, మణికొండలో రూ. 23,710 ఏసీబీ స్వాధీనం చేసుకుంది. వినియోగదారుల నుంచి వసూలు చేసి సాయంత్రానికి ఆర్టీఏ అధికారులు, సిబ్బందికి వాటాలు ముట్టజెప్పేందుకు ఉంచిన నగదుగా భావిస్తున్నారు. ఏసీబీ అధికారులు తలుపులు మూసి లోపల ఉన్న వారందరినీ విచారించారు. కౌంటర్ల వద్ద, కార్యాలయంలో ఉన్న నలుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ దాడులు తెలుసుకున్న పలువురు ఏజెంట్లు తమ చేతుల్లో ఉన్న దరఖాస్తు ఫారాలను దూరంగా విసిరేసి బయటికి పరుగులు తీశారు. బండ్లగూడలో సిబ్బందిలో ఒకరు పారిపోతుండగా పట్టుకుని విచారించారు. కొందరు సిబ్బంది, అధికారుల వద్ద నగదు ఉన్నట్లు కనుగొన్నారు. కంప్యూటర్లలో నిక్షిప్తమైన వివరాలనూ పరిశీలించారు. ఆర్టీఏ కార్యాలయాల సమీపంలోని డ్రైవింగ్ స్కూళ్లు, జిరాక్సు సెంటర్లను మూసివేశారు.

# విపత్తు వేళ.. పెద్దన్నలా సేవ

హైదరాబాద్ : రాజధానిలో ఎక్కడ, ఎలాంటి ప్రమాదం జరిగినా.. ముందుగా అక్కడికి చేరుకునేది జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్(విపత్తు స్పందన దళం) బృందాలే. జీహెచ్ఎంసీలో భాగమైన ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) కింద 2018లో ఏర్పాటై.. ఆది నుంచే నగరవాసులకు నేనున్నానంటూ భరోసా ఇస్తోంది డీఆర్ఎఫ్. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇది పనిచేస్తోంది. కంట్రోల్ రూముకు లేదా సామాజిక మాధ్యమాల ద్వారా అందే ఫిర్యాదులను అధికారులు డీఆర్ఎఫ్, ఈవీడీఎం వాట్సప్ గ్రూపులకు పంపిస్తారు. వెంటనే దగ్గర్లోని వాహనాలన్నీ అక్కడికి చేరుకుని సేవలు ప్రారంభిస్తాయి.

బృందాలు 30
మొత్తం సిబ్బంది 453
రోజుకు మూడు షిఫ్టుల్లో ఏడాది పొడవునా సేవలు
ఇప్పటి వరకు చేపట్టిన సహాయక కార్యక్రమాలు 13,198
కంట్రోల్ రూము నంబర్లు..
9000113667, 040- 2955 5500, 2956 0521, 2956 0528, 2956 0584, 2956 0591

ప్రాణాలు లెక్క చేయకుండా- ఎన్.ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్, ఈవీడీఎం, జీహెచ్ఎంసీ




కాటేదాన్, జీడిమెట్ల, కాప్రా, ఉప్పల్ పారిశ్రామికవాడల్లో, బోయిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల నుంచి డీఆర్ఎఫ్ సిబ్బంది వందల మందిని రక్షించారు. ఎలాంటి విపత్తునైనా వెనకడుగు వేయకుండా డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగుతాయి. ఏ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సిబ్బందికి నాగోల్ ఫతుల్లాగూడలోని శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇచ్చాం. అక్కడ పాటించే ప్రమాణాలను ఎన్‌డీఆర్ఎఫ్ సైతం మెచ్చుకుంది. సీపీఆర్ చేయడంలోనూ శిక్షణ ఇచ్చాం.

## రాత ఇంపు.. పలుకు వినసొంపు

హైదరాబాద్: తొలి పలుకులో అమ్మదనం.. అక్షరాల్లో కమ్మదనం.. నుడికారంలో మమకారం.. ఔచిత్యానికి తలకట్టు తెలుగు భాష సొంతం. అన్య భాషపై మమకారం పెంచుకుంటూ అమ్మభాషను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో కొంతమంది భాషా ప్రేమికులు, సంస్థలు తేనెలొలుకు తెలుగుకు పట్టం కట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. ఆయనింట్లో అడుగడునా తెలుగు ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు డా.గొట్లూరు సురేశ్‌బాబు ఇంటికి వెళ్తే అడుగడుగునా తెలుగే కనిపిస్తోంది. గండిపేట మండలం హైదర్షాకోటలోని తన ఇంటికి కాన్తిమతీ నికేతనము, కింది, మొదటి, రెండో అంతస్తులకు ఇంద్రకీలాద్రి, తిరుమల, యాదగిరి అని పేరు పెట్టారు. ఇంటి 60 మెట్లకు సైతం తెలుగు సంవత్సరాల పేర్లు రాయించారు.

ర్యాప్.. మాతృభాషలో ఊపు

పరభాషకే ప్రాధాన్యమివ్వాలన్న అభిప్రాయాన్ని తుడిచేస్తూ వాడుక భాషలో 'హిప్ హాప్' ర్యాప్ ద్వారా అనేక మంది అభిమానులను సంపాదించుకున్నాడు మియాపూర్‌కు చెందిన 'మహ్మద్ అసద్ ఫరాజ్'. 'హైదరాబాద్ పోరడు' ర్యాప్‌గీతంతో గుర్తింపు తెచ్చుకొని అదే పేరుతో పిలిపించుకుంటున్నాడు. పాశ్చాత్య దేశాల్లో ర్యాప్ గీతాలతో సమాజ పరివర్తనకు కృషి చేస్తున్నారని తెలుసుకొని ఆ దిశగా ప్రయత్నించాలని అనుకున్నాడు. తెలుగులోనే ర్యాప్ గీతాలను రాసి తానే పాడి సామాజిక మాధ్యమాల్లో పెట్టేవాడు. గతేడాది విడుదల చేసిన 'హైదరాబాద్ పోరడు' ర్యాప్ గీతానికి విశేష స్పందన లభించింది. యూట్యూబ్‌లో లక్షల మంది వీక్షించారు.

తెలుగు వికీపీడియన్ ప్రణయ్‌రాజ్

రవీంద్రభారతి: నాటకరంగ పరిశోధకుడు, 'రేపటి తెలుగు సంస్థ'



ప్రతినిధి ప్రణయ్‌రాజ్ వంగరి పదకొండేళ్లుగా అంతర్జాలం వేదికగా తెలుగు వ్యాప్తికి కృషిచేస్తున్నారు. తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్న తలంపుతో 2013, మార్చి 8న తెలుగు వికీపీడియాలో చేరారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, కళలు, సంస్కృతి, పర్యాటక- ఆధ్యాత్మిక ప్రాంతాలకు సంబంధించి ఇప్పటివరకు 7600కు పైగా వ్యాసాలను రాసి విజ్ఞాన సర్వస్వాన్ని భాషాభిమానుల చెంతకు చేరుస్తున్నారు. ఏడాదిలో 365 వ్యాసాలు రాసి వికీపీడియాలో ప్రపంచ రికార్డు సృష్టించారు.

బాలసాహిత్యంలో మేటి

జీడిమెట్లకు చెందిన ఉపాధ్యాయుడు, కవి ఉండ్రాల రాజేశం తెలుగు భాష, సాహిత్యం ఉన్నతికి పాటుపడుతున్నారు. విద్యార్థులకు బాలసాహిత్యాన్ని అందిస్తున్నారు. బాలసాహిత్యంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 200 కవితలు, 500 లకుపైగా బాలల కథలు, 210 గేయాలు రచించినట్లు ఉండ్రాల రాజేశం తెలిపారు. అక్షర కాంతులు, ఊహారేఖలు, బాల కథ దీపిక, బాల్కతా మంజుష, పసిడి వెన్నెల, బంధుప్రీతి వంటి 8 కథల సంపుటికలను ప్రచురించినట్లు చెప్పారు.

నిజాం కాలంలోని మొదటి తెలుగు గ్రంథాలయం


తెలుగు భాష, సాహిత్యాభివృద్ధికి, తెలుగుజాతి వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం. 1901లో ఏర్పడిన మొట్టమొదటి తెలుగు గ్రంథాలయం. రాంకోఠిలోని తన నివాసంలో రావిచెట్టు రంగారావు శ్రీకృష్ణదేవరాయాంధ్ర తెలుగు భాషా నిలయం ఏర్పాటు చేయగా.. మరణానంతరం 1910లో సుల్తాన్‌బజార్‌లో ఓ భవనం కొనుగోలు చేసి అందులోకి మార్చారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014లో దాన్ని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంగా మార్చారు. అక్కడ 50 వేల వరకు పుస్తకాలున్నాయి.

## ఉసురు తీస్తున్న మురుగు

'హైదరాబాద్ : మహానగర వాసుల దాహార్తిని 'జంట' జలాశయాలైన హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాలు తీరుస్తున్నాయి. వాటిలో కొందరు శ్రీమంతులు ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. వాటి డ్రైనేజీని ఈ జలాశయాల్లో కలుపుతున్నా.. ఆ నీటినే ప్రజలు తాగాల్సి వస్తే.. నేను ప్రజాప్రతినిధిగా విఫలమైనట్లే. ఎంత ఒత్తిడి వచ్చినా.. నా మిత్రులకు ఫాంహౌస్‌లున్నా.. ఏవీ వదలకుండా హైడ్రా ద్వారా ఆక్రమణలను తొలగిస్తున్నాం'.

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి

కొంతమంది అక్రమార్కులు భాగ్యనగర ప్రజల జీవన రేఖలైన 'జంట' జలాశాయల ఉసురు తీస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహించి



జలాశయాల్లో కలిసే మురుగుకు అడ్డుకట్ట వేయడంలో జలమండలి యంత్రాంగం చోద్యం చూస్తోందనే ఆరోపణలు నెలకొన్నాయి. జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు, 42 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి రోజూ వేల లీటర్ల మురుగునీరు జలాశయాలను ముంచెత్తుతోంది. జలాశయాల్లోకి విచ్చలవిడిగా మురుగు వచ్చి చేరుతున్నట్లు చాలా ఏళ్లక్రితమే గుర్తించిన జలమండలి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

అటకెక్కిన ప్రతిపాదనలుఉస్మాన్‌సాగర్ పరిధిలో పలుచోట్ల ఎస్టీపీలు నిర్మించాలని అప్పట్లో జలమండలి నిర్ణయించింది. రూ.40.50 కోట్లతో ప్రతిపాదనలూ సిద్ధం చేశారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. అక్రమ నిర్మాణాలపై ఇటీవల 'హైడ్రా' దృష్టి సారించిన నేపథ్యంలో జలాశయాల్లో మురుగుపై ఎలాంటి చర్యలు తీసకుంటుందో అన్న ఆసక్తి వ్యక్తమవుతోంది.

## మైనర్ల వేగం.. తల్లిదండ్రులకు శోకం



కరీంనగర్ : ఒడిశాకు చెందిన ఓ కార్మికుడు జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో సహా అయిదేళ్ల కిందట కరీంనగర్‌కు వచ్చారు. ఉపాధి పొందుతూ ఇక్కడే స్థిరపడ్డారు. నెల రోజుల కిందట ఆయన కుమారుడు (పదహారు ఏళ్లు) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ద్విచక్రవాహనం తీసుకొని స్నేహితులతో రాత్రివేళ నగర శివారుకు వెళ్లాడు. ఇంటికి వచ్చే క్రమంలో ఉజ్వలపార్క్ వద్దనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని ఓ విద్యార్థి ఇంట్లో ఎవరికీ తెలియకుండా కారు బయటకు తీసుకెళ్లాడు. వాహన వేగాన్ని అదుపు చేయకపోవడంతో రోడ్డు పక్కన పని చేసుకుంటున్న వారిపై కారు దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన అప్పట్లో కలకలం రేపింది. విద్యార్థి తండ్రితోపాటు కారులో ప్రయాణించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పద్దెనిమిదేళ్లలోపే చాలామంది విద్యార్థులు ద్విచక్రవాహనాలు, కార్లు నడపాలని ఉత్సాహపడుతుంటారు. అది కాస్త ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. 8వ తరగతి చదువుతున్న చాలామంది విద్యార్థులు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఈ ఏడాది కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఇప్పటివరకు 70కి పైగా మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.

పర్యవేక్షణ లోపం..

వాహనం నడపాలంటే 18 ఏళ్లు నిండటమే కాకుండా రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఇవేమి పట్టకుండా కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛతో ఇష్టానుసారంగా నడుపుతూ.. ప్రమాదం జరిగితే వాహనాన్ని అక్కడే వదిలేసి జారుకుంటున్నారు. వాహన వినియోగంపై సరైన అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇవీ నిబంధనలు..రవాణా శాఖ నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు మాత్రమే వాహనం నడిపేందుకు అర్హులు.మైనర్లు వాహనం నడిపినా, ఏదైనా ప్రమాదం జరిగినా అందుకు కుటుంబ పెద్దలను బాధ్యులుగా చేస్తూ వారిపై కేసు నమోదు చేస్తారు. రూ.1500 జరిమానా విధిస్తారు.

కేసును బట్టి తల్లిదండ్రులు, వాహన యజమానులకు 21 రోజుల జైలు శిక్ష.. రూ.5 నుంచి రూ.25 వేల జరిమానా వేస్తారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త రవాణా చట్టం ప్రకారం.. మైనర్లు జువైనల్ హోంకు వెళ్లే అవకాశముంది. మైనర్లు వాహనం పడిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే.. అతని వయసు, ప్రవర్తన బట్టి కేసును క్రిమినల్ కోర్టుకు బదిలీ చేస్తారు.కేసులు మరింత కఠినం..మైనర్ డ్రైవింగ్‌పై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. మొదటిసారి పట్టుబడితే వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. రెండోసారి మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. ఏదైనా ప్రమాదం జరిగితే మైనర్‌తోపాటు అతని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.- జి.నరేందర్, ఏసీపీ కరీంనగర్ టౌన్

## నిఘా నేత్రాలకు గ్రహణం!



కరీంనగర్ : హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్ద బస్టాండ్ కరీంనగర్‌దే. ఇక్కడ 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం 1,825 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కరీంనగర్ నుంచి రోజు లక్ష మందికి పైగా వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాంటి ప్రయాణ ప్రాంగణంలో సీసీ కెమెరాలు తగినన్ని లేవు. ఉన్నవి పని చేయకపోవడంతో దొంగతనాలు, పోకిరీల బెడద పెరిగింది.

**పట్టింపేదీ?** బస్టాండ్ లోపల, బయట 65కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 45 కెమెరాలు ప్రయాణ ప్రాంగణ ఆవరణలో ఉండగా మిగితావి బయట ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు పోలీస్‌శాఖకు బస్టాండ్‌లో ఓ గది (ఔట్‌పోస్ట్)ని కూడా కేటాయించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో ఏ ఒక్క సీసీ కెమెరా పనిచేయడం లేదు. కొన్ని నిఘా నేత్రాలకు సంబంధించి తీగలు తెగిపోగా మిగిలినవి కూడా పాడైపోగా బాగు చేయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నేర ఘటనలు జరిగినపుడు నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. సీసీ ఫుటేజీల ఆధారంగా పలు కేసుల్లో పోలీసులు గతంలో నిందితులను పట్టుకున్నారు. గతంలో సీసీ కెమెరాలను పోలీసు శాఖ నుంచి నిత్యం పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ నిఘానేత్రాలు పని చేయక పోవడంతో బాగు చేయించడానికి గానీ, లేదా కొత్తవి కొనుగోలు చేయడానికి గానీ ఇటు పోలీసుశాఖకు, అటు ఆర్టీసీకి ప్రత్యేకంగా నిధులు అంటూ లేవు. దీంతో సమస్య పరిష్కారానికి ఎవరూ ముందుకు రావడం లేదు. సమస్యపై ఆర్ఎం సుచరితను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. మంత్రిపైనే ఆశలు..

రవాణశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉండటంతో బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తే కొత్త నిఘా నేత్రాలను బిగించడానికి అవసరమైన నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. వీటి పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది కూడా నిత్యం బస్టాండ్‌లో ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో 23 మంది పొరుగు సేవల సెక్యూరిటీ సిబ్బంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య తగ్గింది. సిబ్బందిని పెంచేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

**ఆందోళనలో ప్రయాణికులు..**

ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొందరు దొంగలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లు, విలువైన వస్తువుల అపహరణకు పూనుకుంటున్నారు. ఈ నెల 27న సిద్దిపేట నుంచి వచ్చిన ఇద్దరు యువకులు బస్టాండ్‌లో మహిళ మెడలోంచి పుస్తెలతాడు, ప్రయాణికుల జేబులోంచి పర్సులు కొట్టేయడానికి యత్నించగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు చోరీకి యత్నిస్తూ ప్రయాణికులపై బెదిరింపులకు పాల్పడగా సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఓ మహిళా కూడా చోరీకి యత్నిస్తూ సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడింది.

కొందరు మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాత్రి సమయంలో అక్కడే ఉంటూ వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## నేతన్నకు ముందే సంక్రాంతి


సిరిసిల్ల : అరకొర ఆర్డర్లతో ఆగుతూ సాగే జిల్లా వస్త్ర పరిశ్రమలో నాలుగు రోజులుగా పాలిస్టర్ మరమగ్గాలపై ఉత్పత్తి పుంజుకుంటోంది. తమిళనాడు ప్రభుత్వం ఏటా పొంగల్ (సంక్రాంతి) కానుకల్లో మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు అందజేస్తుంది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు దక్కించుకున్న గుత్తేదారులు తిరుపూర్, కోయంబత్తూర్, ఈరోడ్, సేలం వంటి వస్త్రోత్పత్తి కేంద్రాల్లో కాటన్ పంచెలు ఉత్పత్తి చేయిస్తున్నారు. పాలిస్టర్ చీరలు మాత్రం సిరిసిల్లకు పంపుతున్నారు. తొమ్మిది నెలలుగా చాలీచాలని ఉపాధితో కాలం వెళ్లదీస్తున్న నేత కార్మికులకు మూడు నెలల పాటు ఉపాధికి ఢోకా లేదు. వీటికి అవసరమైన ముడి సరకు పూర్తిగా తమిళనాడు నుంచే వస్తుంది. ప్రాసెసింగ్, ప్యాకింగ్ అంతా అక్కడే జరుగుతుంది.

జిల్లా వస్త్ర పరిశ్రమలోని మరమగ్గాలపై తమిళనాడు ఆర్డర్లతోనే చీరలు పరిచయమయ్యాయి. వీటి ఆధారంగానే గత ప్రభుత్వం 2017 నుంచి 2023 వరకు బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ కానులను తీసుకొచ్చింది. ఈ ఏడాది వాటి ఊసేలేకుండా పోయింది. తమిళనాడులో సంక్రాంతి కానుకగా 3.12 కోట్ల చీరలు, పంచెల పంపిణీకి బడ్జెట్‌లో రూ.485.25 కోట్లు కేటాయించారు. వీటిలో 1.56 కోట్ల చీరలున్నాయి.

జిల్లాలో 30 వేల మరమగ్గాలపై రోజుకు పది లక్షల మీటర్లు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఈ పరిస్థితిలో పరిశ్రమలోని వ్యాపారులు తమిళనాడు చీరల ఆర్డర్లను అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికీ 11 లక్షల మీటర్ల ఆర్డర్లు వచ్చాయి. రాబోయే రోజుల్లో ఇవి మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు. మీటరుకు కార్మికుడికి రూ.2.20, ఆసామికి రూ.2.50 చెల్లిస్తున్నారు.

నూలు ప్రత్యేకం

తమిళనాడు ప్రభుత్వం చీరల ఉత్పత్తికి ప్రత్యేకంగా ఎయిర్‌టెక్స్ పాలిస్టర్ నూలును వినియోగిస్తుంది. పంచెల్లో 40:60 మోతాదుల్లో కాటన్,



పాలిస్టర్ కలిపి ఉపయోగిస్తుంది. పంచెల తయారీలో అక్కడి కాటన్ పరిశ్రమ నిలదొక్కుకుంటోంది. ఏడేళ్లుగా రాష్ట్రంలో గత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లతో వందశాతం పాలిస్టర్ ఉపయోగించారు. దీంతో వేడి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా మహిళలు చాలా వరకు వీటిపై ఆసక్తి చూపలేదు. గత ప్రభుత్వం సంక్షేమశాఖల ద్వారా ఇచ్చిన ఆర్డర్లకు, సేకరించిన వస్త్రానికి సంబంధించి ఇంకా రూ.130 కోట్ల వరకు రావాల్సి ఉంది.

మూడు నెలలు ఉపాధి

- లగిశెట్టి ప్రసాద్, నేత కార్మికుడు

మా కారా?నాలో సంక్షేమశాఖలకు సంబంధించిన టెస్కో ఆర్డర్లు నాలుగు, తమిళనాడు చీరలు మూడు మగ్గాలపై ఉత్పత్తి చేస్తున్నాను. తమిళనాడు చీరలకు మీటరుకు రూ.2.20 ఇస్తున్నారు. పది మగ్గాలపై పని చేయడంతో వారానికి రూ.3 వేల వరకు కూలి గిట్టుబాటు అవుతుంది. మన ప్రభుత్వం నుంచి ఆర్డర్లు తగ్గడంతో వీటితో ఊరట లభిస్తుంది.

## గ్రామీణ రహదారులు బాగయ్యేనా..!

రామగుండం : రామగుండం పారిశ్రామిక ప్రాంతమే ఆధారంగా వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకుంటూ జీవనం సాగించే సుమారు పది గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. గోదావరిఖని నుంచి పెద్దపల్లికి వెళ్లేవారితో పాటు వివిధ గ్రామాలకు వెళ్లేవారికిదే దగ్గరి దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డు సుమారు రెండు దశాబ్దాలుగా గుంతలమయంగా ఉంటోంది. వర్షం కురిసిందంటే బురదమయంగా మారుతోంది. ఎట్టకేలకు డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ.2.5 కోట్ల అంచనాలతో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో గ్రామీణులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా నత్తనడకన సాగుతున్న పనులు వారిని నిరాశకు గురిచేస్తున్నాయి.

ఆది నుంచీ అవరోధాలే..ఫెర్టిలైజర్ సిటీ నుంచి గుంటూరుపల్లి, ఎల్కలపల్లి మీదుగా పెద్దపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంలో ఆదినుంచి నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఎల్కలపల్లి నుంచి పెద్దపల్లి వరకు రోడ్డు బాగానే ఉండగా ఫెర్టిలైజర్ సిటీ నుంచి ఎల్కలపల్లి వరకు చాలా ఇబ్బందికరంగా ఉంది. గతంలో పలు మార్లు రహదారి నిర్మాణం చేపట్టినప్పటికీ నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో అనతి



కాలంలోనే రహదారి శిథిలమయ్యేది. ఉన్న రోడ్డును కాస్త ఇటీవల రామగుండం ఎరువుల కర్మాగారానికి నీటి సరఫరా పైపులైను నిర్మాణం కోసం తవ్వడంతో గుంతలమయంగా మారింది. రోడ్డు తవ్వడాన్ని గ్రామీణులు అడ్డుకోగా పైపులైను నిర్మాణం పూర్తికాగానే రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన రామగుండం ఎరువుల కర్మాగారం అధికారులు ఆ విషయాన్నే విస్మరించారు. ఎట్టకేలకు డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ. 2.5 కోట్లతో రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు టెండరు ప్రక్రియ పూర్తికాకపోయినా హడావుడిగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించారు. టెండరు ప్రక్రియ పూర్తి చేయించడంతో పాటు పనులు ప్రారంభించారు. ఫెర్టిలైజర్ సిటీ గేటు నుంచి ఎల్కలపల్లిగేటు కాలనీ చివరి వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ అక్కడి నుంచి ఎల్కలపల్లి చివరి వరకు తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. వివిధ కారణాలతో ఎల్కలపల్లిగేటు నుంచి ఎల్కలపల్లి మూల వరకు కంకర పోసి రోలర్‌తో తొక్కించి వదిలేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మళ్లీ గుంతలు పడ్డాయి.

త్వరలోనే పూర్తి

- మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే, రామగుండం

త్వరలోనే ఎల్కలపల్లి రోడ్డు నిర్మాణం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. గత కొన్నేళ్లుగా గ్రామీణులు ఎదుర్కొంటున్న ప్రధాన రహదారి సమస్య పరిష్కారం కానుంది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులు సైతం మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం పనులపై గ్రామీణులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

## వానర బెడద ఇంతింత కాదయా

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో కోతుల గోల మళ్లీ మొదలైంది. ఒకట్రెండు కాదు.. సమూహాలుగా ఏర్పడి వీధుల్లో తిరుగుతున్నాయి. కంటికి కనిపించిన ఆహార పదార్థాలను తీసుకెళ్తుండగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాకపోకలు సాగించే సమయాల్లో చేతుల్లోని వస్తువులను కూడా లాక్కోని వెళ్తున్నాయి.


కోతుల దాడిలో గాయాలు

నెల రోజుల కిందట కరీంనగర్ గ్రామీణ మండలం ఎలబోతారానికి చిన్నారి పాఠశాలకు వెళ్తుండగా కోతులు దాడి చేసి కాలికి గాయం చేశాయి. మరో రోజు ఇదే గ్రామానికి చెందిన మరో వృద్ధురాలిపై దాడి చేయగా, ముఖంపై గాయాలయ్యాయి. ఇలా జిల్లాలో ఎక్కడో ఒక చోట గాయపరుస్తూనే ఉన్నాయి.

నగరంలోని భగత్‌నగర్, హనుమాన్‌నగర్, కట్టరాంపూర్, కోతిరాంపూర్, సప్తగిరికాలనీ, శివనగర్, గణేశ్‌నగర్, మారుతీనగర్, సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, సుభాష్‌నగర్, సవారన్‌స్ట్రీట్, కిసాన్‌నగర్, తదితర ప్రాంతాల్లో కోతులు జనావాసాల్లోనే తిష్ఠ వేస్తున్నాయి.

పెరిగిన ఫిర్యాదులు

కోతులు, కుక్కల సంఖ్య విపరీతమైన ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో టెండర్లు నిర్వహించి ఎప్పటికప్పుడు పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించే వారు. గతేడాది నుంచి వీటిని కూడా పట్టుకోవడం లేదు. ఇటీవల జరిగిన నగరపాలిక సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు,



కోఆప్షన్ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేస్తుండగా, మర్కటాల విషయంలో ఎలాంటి స్పందన కనిపించడం లేదు.

ఇలా అయితే ఎలా?నగరంలో పట్టుకుంటున్న కోతులను అటవీశాఖ అధికారుల సూచనల మేరకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు.సమీప గ్రామాల్లో పట్టుకున్న వానరాలను రాత్రిపూట తీసుకొచ్చి సిరిసిల్ల బైపాస్, రామగుండం బైపాస్ రహదారులపై వదిలేస్తున్నారు.

గతంలో ఒకసారి హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎక్కడి నుంచో కోతులను తీసుకొచ్చి వదిలేసి పారిపోయారు. వాహనాన్ని వెంబడించినా దొరకకుండా వెళ్లిపోయారు. శివారు ప్రాంతాల్లో వదిలేస్తే కనీసం ఆ వాహన నంబర్ ఫొటో తీసి నగరపాలక అధికారులకు చేరవేస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే వీలుంది.పట్టుకునేలా చర్యలువేణుమాధవ్, సహాయ కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

కోతులను పట్టుకోవడానికి టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే పట్టుకుంటాం. ఇప్పటికే ఈ విషయాన్ని పశు వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాం.

# నిధులు జాప్యం.. పనులు అర్ధాంతరం

గోదావరిఖని : రామగుండం కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ప్రకటించినా సకాలంలో విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకు పనులు చేసిన గుత్తేదార్లు బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారు. రామగుండం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో అంచనాలు సిద్ధం చేసి టెండర్లు నిర్వహించిన అధికారులు పనులు మొదలు పెట్టారు. మొదటి సంవత్సరం కొంత మేరకు నిధులు విడుదలైనప్పటికీ ఆ తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఒక్కొక్కరు సుమారు రూ.కోటికి పైగా వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో వాటిని అర్ధంతరంగా వదిలేసి బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విఠల్‌నగర్‌లో చేపట్టిన సమీకృత మార్కెట్ భవన నిర్మాణమే పూర్తికాకపోగా మరో రూ.4.5 కోట్ల వ్యయంతో గోదావరిఖని ఎన్టీఆర్‌నగర్‌లో మరో సమీకృత మార్కెట్ భవన నిర్మాణం చేపట్టారు. పునాదుల వరకు నిర్మించగా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులను వదిలేశాడు. దీంతో ఇనుప రాడ్లు తుప్పు పట్టిపోతున్నాయి. రామగుండంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎన్టీఆర్ నగర్‌లో సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి పలుమార్లు టెండర్లు నిర్వహించినా గుత్తేదార్లు ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఓ గుత్తేదారు పనులు చేపట్టినప్పటికీ మధ్యంతరంగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులను వదిలేశారు. నగరపాలిక సీనియర్ సిటిజన్ పార్కు స్థలంలో రూ.8 కోట్ల అంచనాలతో బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం మొదలు పెట్టారు. నిత్యం రద్దీగా ఉండే వ్యాపార కేంద్రంలో ఈ భవన నిర్మాణం పూర్తయితే వ్యాపారులతో పాటు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందనే రామగుండం నగరపాలక ప్రజల ఆశలు నెరవేరలేదు.



ఆరేళ్ల క్రితం పనులు మొదలుకాగా సుమారు రూ.2 కోట్ల వరకు వెచ్చించి గుత్తేదారు పనులు చేపట్టినప్పటికీ చేసిన పనులకు మధ్యంతర బిల్లులు చెల్లించలేదు. దీంతో సంబంధిత గుత్తేదారు నిర్మాణం పనులను వదిలేశారు.నిరుద్యోగ యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షలకు సిద్ధం చేసే లక్ష్యంతో రూ.5 కోట్ల వ్యయంతో మల్కాపూర్ శివారులో చేపట్టిన అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పునాదులతో పాటు కొంత మేరకు పిల్లర్ల నిర్మాణం జరిగినప్పటికీ బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారు నిర్మాణం పనులను వదిలేశారు. నిర్మాణం పూర్తికాకపోవడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారు.

విఠల్‌నగర్‌లో సమీకృత మార్కెట్ భవన నిర్మాణం రెండు దశాబ్దాల కల. అప్పట్లోనే స్థల పరిశీలన చేసిన జిల్లా పాలనాధికారి అంచనాలు సిద్ధం చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా పనులు మొదలు పెట్టలేదు. ఎట్టకేలకు రామగుండం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులతో విఠల్‌నగర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో సమీకృత మార్కెట్, మరో రూ.కోటి వ్యయంతో సామాజిక భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. సుమారు ఆరేళ్ల క్రితం నిర్మాణం పనులు మొదలైనా నిధుల కొరతతో పాటు కరోనా ప్రభావంతో పనులను ఆపేశారు. ఆ తర్వాత నత్తనడకన పనులు సాగుతున్నాయి.

విడుదలలో జాప్యంతోనే.. –అనిల్‌కుమార్, మేయర్‌సీఎంఈ గ్రాంట్లు, పట్టణ ప్రగతి నిధుల విడుదలలో జాప్యంతోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ విషయమై అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఒక్కో గుత్తేదారుకు రూ.కోటికి పైగా బిల్లులు రావాల్సి ఉంది. టెండరు నాటి కంటే ఇప్పుడు సామగ్రి ధరలు పెరిగాయి. వాటికి అనుగుణంగా నిర్ణయిస్తేనే గుత్తేదార్లు పనులు చేపట్టే అవకాశముంది.

# నిండని నీటి వనరులు

పాలమూరు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెలతో పోలిస్తే భూగర్భ జలాలు స్వల్పంగా పెరిగినా పూర్తి స్థాయిలో నీటి వనరులు నిండలేదు. గత నెలలో భారీ వర్షాలు పెద్దగా లేకపోవడంతో నీరు భూమిలోకి ఇంకలేదు. ఫలితంగా భూగర్భ జలాలు మెరుగుపడలేదు. ఉమ్మడి జిల్లా సాధారణ వర్షపాతం 643.2 మి.మీ.లు. జులై నెల వరకు 226.8 మి.మీ.ల వర్షం కురవాలి. జులై చివరి నాటికి 330.5 మి.మీ.ల వర్షం నమోదు అయింది. సాధారణ వర్షపాతం కంటే 45.7 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. గతేడాది జులైతో పోల్చుకుంటే ఈసారి నమోదైనది తక్కువ వర్షపాతవే. పలు జిల్లాల్లో నీటి మట్టాలు చాలా లోతుకు వెళ్లటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వనపర్తి జిల్లాలోనే కాస్త మెరుగు : భూఉపరితలం నుంచి 20 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు వెళ్తే ఆ ప్రాంతంలో నీటి కష్టాలు తప్పవు. అలాంటివి ఉమ్మడి జిల్లాలో చాలానే ఉన్నాయి. హన్వాడ మండలంలో 28.61 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇదే అతి ఎక్కువ లోతులోకి జలాలు వెళ్లిన ప్రాంతం. గండీడ్ మండలంలో 22.87, నవాబ్‌పేట మండలంలో 20.82, మిడ్జిల్ మండలంలో 20.44 మీటర్లలో లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అమ్రాబాద్ మండలంలో 25.50, పదరలో 25.40, నాగర్‌కర్నూల్‌లో 24.78, కల్వకుర్తిలో 23.76, ఉప్పునుంతలలో 21.41 మీటర్ల లోతులోకి జలాలు వెళ్లాయి. ధరూర్ మండలంలో 27.19, ఉండవల్లిలో 20.97 మీటర్ల లోతులో భూగర్భ జలాలు నమోదు అయ్యాయి. ధన్వాడ మండలంలో 22.75, గుండ్‌మాల్‌లో 20.40 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలో ఒక్క మండలం కూడా 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులోకి భూగర్భ జలాలు వెళ్లలేదు. మదనాపురం మండల కేంద్రంలోనే 14.70 మీటర్ల లోతులో జలాలు ఉండటం విశేషం. గతేడాదితో పోలిస్తే మాత్రం ఇక్కడి నీటిమట్టాలు తక్కువే.

వర్షాలు కురిసే అవకాశం– రమాదేవి, భూగర్భ జల వనరుల శాఖ జిల్లా అధికారి, మహబూబ్‌నగర్

ప్రస్తుతం వర్షాలు బాగానే కురుస్తున్నాయి. గత నెలలో పది రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. రాబోయే రోజుల్లోనూ వర్షాలు కురిస్తే గతేడాదిలో నమోదైన నీటిమట్టాలను అధిగమించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే తీవ్ర నీటి ఎద్దడి ఉన్న కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఇంకా పెరగాల్సిన అవసరముంది.

# స్థలాల క్రమబద్ధీకరణ కసరత్తు షురూ



వికారాబాద్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు (ఎల్‌ఆర్‌ఎస్) ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో జిల్లాలోని ఆయా శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి తగిన విధంగా తర్ఫీదునిచ్చి క్రమబద్ధీకరణ కార్యక్రమంలో పాల్గొనేలా చేస్తారు. క్షేత్రస్థాయిలో ప్లాట్లను తనిఖీ చేయడం, దరఖాస్తుదారుల పరిశీలించటం వంటి ప్రక్రియను పూర్తి చేస్తారు. జిల్లాలో స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ మూడు సంవత్సరాలకోసారి సాగుతోంది. ఈసారి మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి.

**గతంలో ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లింపు**

గత ప్రభుత్వ హయాంలో పురపాలిక, గ్రామ పంచాయతీ పరిధిలో 2022 ఆగస్టు 26కు ముందు రిజిస్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఆ సమయంలో అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. నాటి నుంచి పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

**సహాయ కేంద్రాల ఏర్పాటు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే వడపోస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లయితే దరఖాస్తుదారులకు సమాచారం అందుతుంది. వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల, పట్టణ ప్రణాళిక పంచాయతీ అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది.

క్రమబద్ధీకరణ నోటీసులకు సంబంధించిన సమస్యలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో, మున్సిపాలిటీల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రక్రియను ప్రతి వారం సమీక్షిస్తారు. ఈ కేంద్రాలో దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందజేస్తారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు.

**మార్కెట్ విలువలో 14 శాతం మేర వసూలు**

ప్రస్తుతం పురపాలిక సంఘాలు నిధులు లేక నీరసిస్తున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్లాట్లు మార్కెట్ విలువలో 14 శాతం మేర వసూలు చేయనుంది. ఎల్‌ఆర్‌ఎస్–2019 పథకం కింద స్వీకరించిన దరఖాస్తులు 4023 కాగా వసూలు చేసిన ఫీజు రూ.56.90 లక్షలుగా ఉంది. **మండలాల వారీగా బృందాల ఏర్పాటు**

– లింగ్యానాయక్, జిల్లా అదనపు పాలనాధికారి, వికారాబాద్.

జిల్లాలో ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం మండలాల వారీగా బృందాలను ఏర్పాటు చేశాం. దీని కోసం ప్రత్యేకంగా యాప్‌ను వినియోగిస్తున్నారు. యాప్‌ను వినియోగించే విధానాన్ని తెలుసుకోవడానికి బృందాలకు తగిన శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. త్వరలోనే జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది.

# ఆటలు మస్తు.. ఆరోగ్యమస్తు



హైదరాబాద్ : 58 శాతం మందికి ఆడాలని ఉన్నా సమయం లేదని చెప్పారు. టీవీ, మొబైల్, సామాజిక మాధ్యమాల్లో వీరే నాలుగు నుంచి ఐదు గంటల సమయం గడుపుతున్నారు.

క్రీడలు శారీరక దారుఢ్యానికే కాదు మానసిక ఉల్లాసానికి కూడా. పతకాలే పరమావధి కానక్కర్లేదు పదుగురితో కలిసిపోయేందుకు కూడా. ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుతారు. ఈసారి ‘స్పోర్ట్స్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ పీస్‌ఫుల్ అండ్ ఇన్‌క్లూజివ్ సొసైటీస్’ ఇతివృత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రజలను క్రీడలను ఏ విధంగా ఏకతాటిపైకి తీసుకువస్తాయో, ఆరోగ్యవంతమైన దేశాన్ని ఎలా నిర్మించవచ్చో తెలిపేందుకు ఈ అంశాన్ని ఎంచుకుంది.

ఏడాదికాలంగా ఎలాంటి క్రీడలు ఆడనివారి 57 శాతం ఉన్నట్లు ఓ సర్వే వెల్లడించింది.

నెలలో ఒకసారైనా ఏదో ఒక ఆట ఆడుతున్నామని చెప్పినవారిలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది.

ఫిట్‌గా, ఒత్తిడి దూరం చేసుకునేందుకు..

క్రీడలు ఆడేవారిని అడిగితే.. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండేందుకు, ఒత్తిడి దూరం చేసుకునేందుకు ఆటల్ని ఎంపిక చేసుకున్నట్లు చెబుతున్నారు. ఇంటికి సమీపంలోని మైదానాలకు వెళ్లి ఆడేవారే 76 శాతం మంది ఉన్నారు. మౌలిక వసతుల లేమి వంటి సాకులు వీరు చెప్పడం లేదు. 65 శాతం మంది చుట్టుపక్కల వారితో కలిసి ఆడుతున్నారు. ఇది వారి మధ్య సఖ్యతను పెంపొందించడానికి దోహదం చేస్తుంది. ఆధునిక జీవనశైలిలో, కార్పొరేట్ ప్రపంచంలో వీటికి మరింత ప్రాధాన్యం ఉంది. ఆరోగ్యకర జీవితానికి దోహదపడతాయి.

క్రికెట్ జట్టుకు సారథి

బోడుప్పల్: బోడుప్పల్‌లోని పర్వతాపూర్‌కు చెందిన గుగులోతు కావ్యశ్రీ అండర్–19 క్రికెట్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. తండ్రి శ్రీనివాస్ క్యాటరింగ్ వ్యాపారం చేస్తుండగా ఉండగా, తల్లి గృహిణి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అండర్–15, 19 రాష్ట్ర స్థాయిలో కెప్టెన్‌గా చేశారు. పదేళ్ల వయసులోనే బ్యాట్ పట్టింది. అప్పటినుంచి వెనుతిరిగి చూడలేదు. ఆట తీరుతో సెలక్టర్లను ఆకట్టుకోవడంతో అండర్–23 జట్టులోకి వెళ్లింది.

అనిల్.. ఎవరికీ అందడు

నేరేడ్‌మెట్: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా చేస్తున్న అంబోజు అనిల్‌కుమార్(44) అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ సత్తా చాటుతున్నాడు. రెండేళ్లుగా దేశం తరఫున 800, 1500, 5000వేల మీటర్ల పరుగులో బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నాడు. దక్షిణ కొరియా, థాయ్‌లాంటి తదితర దేశాల్లో ఆడి పతకాలు సాధించాడు. ఆస్ట్రేలియాలో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్‌పోటీల కోసం కసరత్తు ప్రారంభించాడు.

ఇటీవల హైదరాబాద్‌తో సహా వేర్వేరు నగరాల్లో చేసిన ఒక అధ్యయనంలో.. దాదాపు మూడింట ఒక వంతు మంది జనాభా ఎలాంటి శారీరక శ్రమ చేయడం లేదని తేలింది. క్రికెట్, బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వాలీబల్, హాకీ, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలే కాదు నడక, పరుగు, ఇండోర్‌లో చేసే జుంబా, యోగ కూడా చేయడం లేదు.

శాంతి, సామరస్యం పెంపొందిస్తాయి..

ఆటలు ఆడటం 1840లలో మొదలైంది. మనుషుల మధ్య సామరస్యం, ఆరోగ్యకరమైన పోటీతత్వం కోసం ప్రారంభించారు. చిన్నప్పుడు మేం ఆనందం కోసం ఆడేవాళ్లం. అలిసిపోయాక చెమటలు చిందిస్తూ ఒక దగ్గర కూర్చోని హాయిగా నవ్వుకునేవాళ్లం.

డాక్టర్ భక్తీయార్ చౌదరీ, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి ప్రవల్లిక

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండికి చెందిన చేపూర్వ ప్రవల్లిక సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తోంది. ఎనిమిదో తరగతి చదివే సమయంలో అమెరికాలోని నాసా కేంద్రం సందర్శించే అవకాశం వచ్చింది. ట్రస్టు బిల్డింగ్ ప్రాజెక్టు పూర్తి చేసినందుకు నాసా బంగారు పతకం అందించింది. పంజాబ్ జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేసింది. క్రీడా కోటాలోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించింది.

ఇన్‌లైన్ హాకీలో ‘రాణి’స్తూ..

ఎల్బీనగర్‌కు చెందిన టంగుటూరి నందిత తొమ్మిదేళ్లుగా రోలర్ హాకీ (ఇన్‌లైన్ హాకీ)లో ప్రతిభ కనపరుస్తోంది. దేశ జట్టుకు ఎన్నికై ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 9 వరకు ఇటలీలో జరిగే వరల్డ్ స్కేట్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికై వెళ్లింది. ఐదేళ్లుగా రాష్ట్రస్థాయి జట్టుకు సారథిగా వ్యవహరిస్తోంది. రాష్ట్రస్థాయి పోటీల్లో 4 బంగారు పతకాలు, ఒక వెండి పథకాన్ని సాధించింది. 8 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. 2021లో జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పథకం సాధించింది. 2023 ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో చైనాలో జరిగిన పోటీల్లో కాంస్య పథకం సాధించిన జట్టులో సభ్యురాలు.

# సుందరీకరణ మాటున ఆక్రమణలు

హైదరాబాద్ : హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులను ఆక్రమించేందుకు కొన్ని రియల్ సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత ముసుగులో అక్రమాలకు తెరతీశాయి. శేరిలింగంపల్లి, గండిపేట్ మండలాల్లో చెరువులను సంరక్షిస్తామని కొన్ని రియల్ సంస్థలు జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో ఒప్పందాలు కుదుర్చుకొని బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లను ఆక్రమించుకుంటున్నాయి. రెండు మండలాల పరిధిల్లో 20 చెరువులను సంరక్షిస్తామంటూ రియల్ సంస్థల ప్రతినిధులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కొద్దినెలల నుంచి పనులు చేస్తున్నారు. ఇందులో 12 చెరువులను రింగ్‌బండ్ పేరుతో క్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారు. మరో రెండు చోట్ల గేటెడ్ కమ్యూనిటీల మురుగును చెరువులోకి మళ్లిస్తున్నారు.వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు..చెరువులను సుందరీకరిస్తామంటూ రియల్ సంస్థల ప్రతినిధులు అధికారులకు వివరించారు. రింగ్‌బండ్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మిస్తామంటూ చెప్పారు. తమ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు అక్కడే నిర్మించారు. సమీపంలో సరిహద్దులు తొలగించి బఫర్‌జోన్‌లో ప్రహారీలు నిర్మించుకున్నారు. ఫుల్‌ట్యాంక్ లెవల్‌లో సుందరీకరణ పనులు చేపట్టారు.

ఆ భూముల విలువ రూ.300 కోట్లకు పైమాటే..

చెరువుల సుందరీకరణ పేరుతో స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.300కోట్లకు పైమాటే.. నల్లగండ్ల చెరువు బఫర్‌జోన్‌ను ఓ రియల్ సంస్థ ఆక్రమించింది. దీని విలువ రూ.70కోట్లు.

మియాపూర్ పటేల్ చెరువులో ఓ రియల్ సంస్థ బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే



ప్రాంతమంతా నిర్మాణాలు చేపట్టింది. అధికారుల దృష్టి మళ్లించేందుకు ఎఫ్‌టీఎల్‌లో సుందరీకరణ చేపట్టింది. మల్కంచెరువును అభివృద్ధి చేసేప్పుడు ఓ రియల్ సంస్థ తమ నిర్మాణాలను బఫర్‌జోన్‌లోకి తీసుకొచ్చింది. వర్షాలు కురిసినప్పుడు నీళ్లు అటువైపురాకుండా నీటిని చెరువులోకి మళ్లించారు. గోపిచెరువు బఫర్‌జోన్‌లో భారీగా నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా రేకుల షెడ్లను బఫర్‌జోన్‌లో నిర్మించారు. కొద్దిరోజుల వరకూ బఫర్‌జోన్‌లో నీళ్లున్నా.. మట్టితో పూడ్చేశారు.

# ఇటు శుభ్రం.. అటు అధ్వానం

హైదరాబాద్: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో గందరగోళం నెలకొంది. నిర్వాహకులు తీసుకున్న నిర్ణయం చుట్టుపక్కల గ్రామాలకు, ఇటీవలే శుద్ధి ప్రక్రియ పూర్తయిన మల్కారం చెరువుకు శాపంగా మారనుంది. ప్రధాన రహదారివైపు వెళ్లే వాహనదారులు గాలి పీల్చుకోలేని దుస్థితి ఏర్పడింది. పాత చెత్తకుప్పలపై కాకుండా.. కొత్త ప్రదేశంలో రెండు లక్షల టన్నుల చెత్తను కుప్పలుగా పోస్తున్నారు. కొత్తగా వేస్తున్న చెత్తతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనున్న హరిదాసుపురం, దమ్మాయిగూడ తదితర గ్రామాలు, మల్కారం చెరువు కాలుష్య కాసారంలా మారబోతున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా.. నగరంలో రోజూ 7,500టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. పలు శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లోని వ్యర్థాలు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. పొడి చెత్తను కొన్ని రోజులపాటు ఎండబెట్టి విద్యుదుత్పత్తి కేంద్రానికి ఉపయోగిస్తారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చేస్తారు. ఎందుకు పనికిరాని వ్యర్థాలను డంపింగ్‌యార్డులో కుప్పలుగా పోస్తారు.



కొన్ని రోజులుగా ఎండిన చెత్త(ఆర్‌డీఎఫ్) కుప్పలుగా పేరుకుపోతోంది. వర్షాలతో 2 లక్షల టన్నులకుపైగా ఆర్‌డీఎఫ్ తడిసిపోయింది. దాన్ని ఆరబెట్టడం డంపింగ్‌యార్డులోని రోడ్డున కుప్పలుగా పోసేస్తున్నారు.

అస్తవ్యస్త నిర్ణయాలు మామూలే..

నగరంలోని చెత్త 2009 నుంచి జవహర్‌నగర్‌కు చేరుతోంది. 2012లో డంపింగ్‌యార్డు నిర్వహణపై జీహెచ్‌ఎంసీతో ప్రైవేటు సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

అప్పటికే అక్కడున్న లక్షలాది టన్నుల చెత్తను 153ఎకరాల విస్తీర్ణంలో కుప్పలుగా పోశారు. ఆ కుప్పలను 2018లో క్యాపింగ్ చేశారు. అప్పట్నుంచి.. రోజువారీ ఉత్పత్తయ్యే చెత్తను రీసైక్లింగ్ చేస్తూ.. ఎందుకూ పనికిరాని వ్యర్థాలనే నిల్వ చేస్తున్నారు.

అలా పోగయ్యిందే ఆర్‌డీఎఫ్. తడిసి ముద్దయిన ఆర్‌డీఎఫ్‌ను వదిలించుకునేందుకు నిర్వహణ సంస్థ ఒప్పందాన్ని ఉల్లంఘించి గ్రామాలు, చెరువులను బలితీసుకుంటోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థలం లేకనే..“రోజువారీ ఉత్పత్తయ్యే ఆర్‌డీఎఫ్‌లో.. సగం మాత్రమే జవహర్‌నగర్‌లోని విద్యుదుత్పత్తి కేంద్రానికి ఉపయోగపడుతోంది. మిగిలినదంతా అక్కడే పోగవుతోంది..”అని జీహెచ్‌ఎంసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

# తొలిమెట్టు.. ఫలితాలు మెరుగుపడేట్టు

పెద్దపల్లి : పిల్లల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు విద్యాశాఖ చేపట్టిన భాష గణిత మూల్యాంకన సాధన (ఫౌండేషనల్ లిటరసీ న్యూమరీ – ఎఫ్ఎల్ఎన్) విధానం సత్ఫలితమిస్తోంది. గత ప్రభుత్వం తొలిమెట్టుతో దీన్ని అమలు చేయగా తాజాగా స్వల్ప మార్పులు చేశారు. గతనెలలో జరిగిన ప్రారంభ పరీక్ష ఫలితాలు పరిశీలిస్తే కాస్త విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఈ ఏడాదికి సంబంధించి అడ్డంకులు అధిగమించి మరింత పకడ్బందీగా బోధించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.దిద్దుబాటుపై దృష్టి

జిల్లాలో 363 ప్రాథమిక, 83 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 12,154 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది స్వల్ప మార్పులతో ఎఫ్ఎల్ఎన్ కోసం సన్నద్ధమవుతున్నారు. మొదట్లో వారంలో అయిదు రోజులు సాధన చేసి ఆరో రోజున మూల్యాంకన పరీక్ష ఉండేది. ప్రస్తుతం జులైలో ప్రారంభ పరీక్ష, డిసెంబర్‌లో మధ్యమ, ఏప్రిల్‌లో అంతిమ పరీక్షలు ఉంటాయి. గత పొరపాట్లపై దిద్దుబాటు చర్యలు చేపట్టారు. చదవడం, రాయడం, గుణకారం, భాగహారం, తీసివేతలు, చతుర్విధ ప్రక్రియల్లో తడబాటును గుర్తిస్తున్నారు. లోపాలను సరిచేసి పకడ్బందీగా అమలు చేయనున్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ముందుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్నారు. త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ మొదలుకానుంది.

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2 నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం మూడేళ్ల క్రితం దీనికి శ్రీకారం చుట్టారు.

ప్రతివారం మూల్యాంకన పరీక్ష నిర్వహించడంతో కొంత అక్షర ప్రగతి పర్వాలేదు. అప్పటి ప్రారంభ పరీక్షలో 12.50 శాతం ఉండగా ప్రస్తుతం 29.35 శాతం పెరిగింది.కొంతమంది పిల్లలు తెలుగులో చదవడం, రాయడంలో తడబాటును అధిగమించాల్సి ఉంది.

పదాలను గుర్తుంచుకుంటున్నా..– సిద్ధ జైన, 4వ తరగతి, వెక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాల చదవడం, రాయడంలో నాకు కొంత ఇబ్బంది ఉండేది. మా బడిలో నిత్యం సాధన చేయడంతో ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఇప్పుడు చక్కగా చదువుతున్నా. చూసి రాసిన పదాలను గుర్తుంచుకుంటున్నా.

# రిజర్వేషన్లపై తెగని పంచాయతీ

కరీంనగర్ : పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్ల పీటముడి వీడక ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.. ఓవైపు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఓటరు జాబితా రూపకల్పనలో ఉమ్మడి జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు.. మరోవైపు ఎన్నికల బరిలో దిగేవారు ఇప్పటికే తమ అనుచరులతో పావులు కదుపుతున్నారు.. మాజీలు సైతం తమ బలాన్ని నిలుపుకొనే దిశగా ప్రణాళికలు రచించుకుంటున్నారు.. రిజర్వేషన్ల అంశం తేలితేనే తమ ప్రయత్నాలు ముమ్మరం చేసుకోవచ్చని వారు భావిస్తున్నారు.

కొత్త విధానంపై సమాలోచనలు?

గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్లపాటు అమలయ్యేలా చట్టం చేసింది. అయిదేళ్ల కిందట ఆ మేరకే ఎన్నికలు జరిగాయి. ఆ చట్టం ప్రకారం చూస్తే ప్రస్తుతం పాత రిజర్వేషన్లే అమలు కావాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త విధానం అమలు చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పాత రిజర్వేషన్లు రద్దు చేసి కొత్తవి ఎలా అమలు చేస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ అదే జరిగితే ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశముంది. మరోవైపు వార్డుల వారీగా ఓటర్లను విభజించి కుటుంబంలో ఓటు హక్కు కలిగిన వారందరినీ.. ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వినియోగించుకునే విధంగా జాబితా తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,210 గ్రామ పంచాయతీల్లోని 11,132 వార్డుల పరిధిలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే నెల 21న తుది జాబితా ప్రకటించనున్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆశావహులు ఆందోళన పడుతున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో సంస్కరణలు

కరీంనగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేలా అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. కొన్ని రోజుల కిందట సరళ భాషలో విద్యా బోధనకు నూతన పుస్తకాలను ముద్రించారు. వాటి బోధనకు హైదరాబాద్‌లో కొంతమంది ఎంపిక చేసిన అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారు మిగిలిన వారికి శిక్షణ ఇచ్చే పనిలో ఉన్నారు. తాజాగా పూర్వ ప్రాథమిక విద్యకు కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అవసరమైన వస్త్రాలు సైతం ఇటీవల జిల్లా సంక్షేమ కార్యాలయానికి చేరాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన బోధన

జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటి పరిధిలో మూడు నుంచి ఆరేళ్లలోపు కేంద్రాలకు వచ్చే వారిలో 20,507 మంది చిన్నారులున్నారు. ముందుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న



అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. వాటిని కుట్టే బాధ్యతను జిల్లా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పని చేస్తున్న మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున అంగన్‌వాడీ బాలలకు అప్పగిస్తారు. సరళ పదాలతో అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేక సిలబస్‌తో రూపొందించిన పాఠ్య పుస్తకాలు సైతం జిల్లాకు చేరాయి. వీటిని త్వరలోనే అప్పగించనున్నారు. పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శిని-1 పేరుతో వెలువడిన పుస్తకాలతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా బోధన ఉండేలా చర్యలు చేపడుతున్నారు. బలోపేతానికి చర్యలు- ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్ఠం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. టీచర్లకు నూతన పుస్తకాల పంపిణీతోపాటు పిల్లలకు ఏకరూప దుస్తులను కుట్టించి పంపిణీ చేస్తాం. కేంద్రాలకు వచ్చే బాలలకు నాణ్యమైన బోధన, పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

# అసంఘటిత రంగ కార్మికులే అధికం

పెద్దపల్లి : 'వలస కూలీలను పనిలో పెట్టుకొనే యాజమాన్యాలు వారి నడవడిక, నేర చరిత్ర గురించి స్వయంగా విచారణ నిర్వహించిన తర్వాతే ఉపాధి కల్పించాలి.' కార్మికుల నేర చరిత్ర తెలుసుకోవడం ద్వారా కొంతవరకు నేరాల నియంత్రణ సాధ్యమే అయినా ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులే అధికంగా ఉండటంతో సాధ్యాసాధ్యాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వలస కూలీల గణాంకాలు కార్మిక శాఖ వద్ద అందుబాటులో ఉండటం లేదు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు, భవన నిర్మాణ కూలీలు, పరిశ్రమల్లో పని చేసే సాంకేతిక నిపుణుల వరకు వివిధ రంగాల్లో 50 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఇటుకబట్టీల్లోనే పెద్దసంఖ్యలో కూలీలున్నట్లు అనధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

మారిన పరిస్థితులు

40 ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసలు ఎక్కువగా ఉండేవి. సాగునీటి వసతి అందుబాటులోకి రావడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవడంతో క్రమంగా తగ్గిపోయాయి. అదే సమయంలో పదేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే కార్మికుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడి పరిశ్రమలతో పాటు అసంఘటిత రంగంలో పొరుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇందులో ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, గ్రానైట్ పరిశ్రమల్లోనే 80 శాతం మంది వలస కూలీలున్నారు.

స్పష్టమైన కార్యాచరణతోనే..

చిత్తశుద్ధి ఉంటే వలస కూలీల గణాంకాల సేకరణ, వారి నియంత్రణ పెద్ద సమస్యేమీ కాదు. కానీ ఏదైనా ఘటన జరిగినపుడే అధికారులు హడావుడి చేస్తూ మిగతా సమయాల్లో వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సీజన్‌ల వారీగా.. ఏడాది పొడవునా ఏయే రంగాల్లో వలస కూలీలు పని చేస్తున్నారో సంబంధిత శాఖల ద్వారా వివరాలు సేకరించడం సులభమవుతుంది. ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పని చేసే కార్మికుల వివరాల కోసం యాజమాన్యాలు ఏటా పనులు ప్రారంభించే సమయంలోనే అధికారులు కూలీల వివరాలు సేకరించాలి. నిర్మాణ రంగ కార్మికులు, ఇతర రంగాల కూలీలు, వారిని నియమించుకున్న యజమానులను గుర్తించాలి. వారి ద్వారా వివరాలు సేకరించి, గుర్తింపు కార్డులు జారీ చేయాలి. కార్మిక శాఖ గుర్తింపు కార్డు జారీ చేసిన వారినే పనిలో పెట్టుకోవాలనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. దీంతో వలస కార్మికుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉంటాయి. తద్వారా వారి నేర చరిత్రను కూడా ఆరా తీసే అవకాశం ఉంటుంది. కాట్నపల్లి ఘటనలో పోలీసులు వేగంగా స్పందించడంతో నిందితుడిని పట్టుకోగలిగారు. లేదంటే నిందితుడి ఆచూకీ కూడా దొరికేది కాదు. ఈ ఘటనకు పాల్పడిన బిహార్ కూలీ వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన మరో వ్యక్తి ఆధార్ కార్డు లభించింది. సీసీ కెమెరా ఫుటేజీ కూడా నిందితుడిని గుర్తించేంతగా స్పష్టత లేదు. అనుమతి లేనివే అధికంఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలైన బియ్యం మిల్లులు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించిన ఇటుక బట్టీలకు పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు లేవు. పెద్దపల్లి జిల్లాలోని 150 బియ్యం మిల్లుల్లో కేవలం మూడింటికి మాత్రమే అనుమతి ఉండటం గమనార్హం. ఇక భవన నిర్మాణ కార్మికులు మినహా ఇతర అసంఘటిత రంగాల కార్మికులను గుర్తించే కనీస కార్యాచరణ కూడా కార్మిక శాఖ చేపట్టడం లేదు. వలస కార్మికుల సంక్షేమాన్ని కూడా ఆ శాఖ విస్మరించింది. గతంలో ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులకే పరిమితమైన వలస కూలీలు కొన్నేళ్లుగా వ్యవసాయ పనులకూ వస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాళ్లలో పని చేస్తున్నారు.నైపుణ్యం కలిగిన కార్మికులు భవన నిర్మాణం, ఇంటీరియర్ డిజైనింగ్, మగ్గం వర్క్, బంగారు అభరణాల తయారీ వంటి పనులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ, డెయిరీలతో పాటు మిల్లుల్లో ఆపరేటర్లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల డ్రైవర్లుగానూ పని చేస్తున్నారు.

# ఆస్పత్రుల్లో భద్రత ప్రశ్నార్థకం!

కరీంనగర్ : రోగులకు చికిత్స అందించే ఆస్పత్రుల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు.. అనారోగ్యమని ఆస్పత్రుల మెట్లు ఎక్కేవారి భద్రత ప్రశ్నార్థకమవుతోంది.. గత నెలలో దిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం జరిగినప్పటికీ ఉమ్మడి జిల్లాలో భద్రతా లోపాల్ని సవరించుకోవడం లేదు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు రేగిన ఘటన మరోసారి భద్రతను ప్రశ్నార్థకం చేసింది.. నాలుగు జిల్లాల పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లోని వసతుల తీరుపై గతేడాది అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,186 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నట్లు అప్పట్లో గుర్తించారు. దాదాపు 80 శాతం ఆస్పత్రుల్లో ఏదో ఒక లోపముందని గుర్తించిన అధికారులు 20 శాతం దవాఖానాలకు తాఖీదులు అందించారు. కానీ ఇప్పటి వరకు మళ్లీ ఆ ఆస్పత్రుల జోలికి వెళ్లిన దాఖలాలు లేవు. నిర్వహణ మొక్కుబడిగానే..ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉపకరణాల ఏర్పాటు, నిర్వహణ విషయంలో చాలా యాజమాన్యాలు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయి. భవనం అనుమతుల నుంచి అడుగడుగునా నిబంధనల అతిక్రమణలే ఉంటున్నాయి. పర్యవేక్షణ అధికారుల్ని మచ్చిక చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా వైద్యారోగ్యశాఖతోపాటు పుర, నగరపాలక సంస్థలు, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు శాఖ ఇలా పలు శాఖల నిరంతర పర్యవేక్షణ ఆస్పత్రులపై ఉండాలి. అగ్నిమాపక శాఖ వారు ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా.. పని చేస్తున్నాయా పరిశీలించాలి. విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తు ఉపకరణాలు నాణ్యమైనవే వాడుతున్నారా.. వారు అనుమతి తీసుకున్న కెపాసిటీ మేరకే వినియోగిస్తున్నారా.. వైరింగ్ ఎలా ఉంది తదితర విషయాలు పరిశీలించాలి. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు, జనరేటర్, విద్యుత్తు ఉపకరణాలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశము ంటుంది. ఇవన్నీ సరిగా ఉన్నాయా లేదా క్రమం తప్పకుండా ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతుందన్న ఆరోపణలున్నాయి. పైగా ఆస్పత్రిలో ఏ ఉపకరణాల్ని వాడుతున్నారనే విషయంలో లెక్కాపత్రం లేదని వైద్యఆరోగ్యశాఖకు చెందిన ఓ అధికారి చెప్పడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే ఆస్పత్రులపై దృష్టి పెట్టి భద్రత విషయంలో చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలు ముందు జరగకుండా ఉండే అవకాశం ఉంది. ఈ విషయమై జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్నను సంప్రదించగా ప్రతి ఆసుపత్రిలో భద్రత ప్రమాణాలు పాటించడం యాజమాన్యాల బాధ్యత అన్నారు. తాము పలుమార్లు అవగాహన కల్పించామని, తనిఖీలు చేశామని.. నిబంధనల మేరకు లేని వాటికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. మరోసారి అన్ని ఆస్పత్రులపై దృష్టి సారించి సూచనలు ఇస్తామన్నారు.

ప్రైవేటు దవాఖానాలో చెలరేగిన మంటలుకరీంనగర్‌లో గాయత్రి ఆసుపత్రిలోని ఒక గదిలో మంటలు చెలరేగడ ంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఆసుపత్రి రెండో అంతస్తులో చికిత్స పొందేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏసీ గది నుంచి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గదిలో రోగులు లేరు. మంటలతో వ్యాపించిన పొగలను గుర్తించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.

# మత్తు వదిలించేందుకు.. కొత్త ఎత్తు



భువనగిరి : పట్టణాలు, గ్రామాలు మొదలుకుని ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుంది. ఈ మహమ్మారి కట్టడికి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే విద్యాలయాల్లోనూ నిలువరించే చర్యల్లో భాగంగా తాజాగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందాయి.

కట్టడి క్లబ్ ఏర్పాటు ఇలా..

క్లబ్ అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపల్ కొనసాగుతారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు లేదా చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్, సభ్యులుగా 6-10 తరగతుల నుంచి ఇద్దరు చొప్పున క్రియాశీల విద్యార్థులు, 6-10 తరగతులకు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది ఒకరు సభ్యులుగా ఉంటారు. కమిటీ కార్యకలాపాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లనూ వినియోగించుకోవచ్చని ఆదేశించారు. క్లబ్ నిర్వహణకు సంబంధించి అతి త్వరలో మార్గదర్శకాలు జీరీ చేస్తామని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కమిటీ కార్యకలాపాలు ఇవీ..

మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థులుంటే గుర్తించి వారిని అప్రమత్తం చేస్తారు. వాటి దుష్ప్రభావాలు వివరించి ఆ మహమ్మారి నుంచి దూరమయ్యేలా అవగాహన కల్పిస్తారు. వీటి అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తున్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకుని కట్టడి చేసి సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందిస్తారు. పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కలా ఏదైనా కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, పదార్థాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండేలా చేయడం కమిటీ చేపడుతుంది.

# ఉసురు తీసిన ఉత్సాహం



నల్గొండ : ఈత సరదా ముగ్గురి ప్రాణాలను మింగేయగా..పండగ పూట పుణ్యస్నానం ఆచరిద్దామని వచ్చిన వ్యక్తి, లోతు తెలియక నీటమునిగి మరణించారు. ఉమ్మడి జిల్లాలోని ఆత్మకూరు (ఎస్), నేరేడుగొమ్ము మండలాల్లో ఒకే రోజు జరిగిన ఈ ప్రమాదాలు బాధిత కుటుంబాల్లో తీవ్ర వేదనను నింపాయి. రెండు ప్రమాదాల్లో మూడు కుటుంబాల పెద్దలు మరణించడంతో ఆ కుటుంబాలు దిక్కులేనివయ్యాయి. వానాకాలం సీజన్ ప్రారంభమైనా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చెరువులు, నీటి వనరుల్లోనే నీళ్లు ఉండటం, అందులో గతంలో మిషన్ కాకతీయలో భాగంగా మట్టి తీయడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇవి తెలియకపోవడంతో నీట మునిగి తనువు చాలించారు. రెండు ప్రమాదాల్లోనూ మరణించిన వృశాంక (12), కృపరాజు (42), శ్రీపాల్‌రెడ్డి (44), జగదీశ్ (42)లు స్థానికులు కాకపోవడం గమనార్హం. స్థానికులైతే ఆయా ప్రాంతాల్లోని నీటి వనరులపై అవగాహన ఉంటుందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సరదాకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని నీటిపారుదల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సూచిక బోర్డులెక్కడ?

మరోవైపు క్వారీలు, చిన్ననీటి వనరులు, చెరువుల వద్ద అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. తాజా ఘటనల్లోనూ రెండు ప్రాంతాల్లో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. క్వారీలపై పర్యవేక్షణ, నిఘాలో మైనింగ్ శాఖ విఫలమవుతోందని సంబంధిత ఉన్నతాధికారులే అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని నల్గొండ, దేవరకొండ, సూర్యాపేట, కోదాడ, ఆత్మకూరు, చౌటుప్పల్, బొమ్మలరామారం, భువనగిరి ప్రాంతాల్లో భారీగా కంకర క్వారీలున్నాయి. వీటిలో చాలా వాటికి అనుమతులు లేనివే ఉన్నాయి. కొన్ని మూత పడగా...అక్కడ ఏర్పడిన గుంతలను పూడ్చడంలో సదరు యజమానులు ఆసక్తి చూపడం లేదు. దీంతో వర్షాకాలంలో వాటిలో నీళ్లు నిలిచి ఎవరైనా సరదాకు ఈతకు దిగితే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాగార్జునసాగర్‌లోనూ రోజురోజుకూ నీటి నిల్వలు పడిపోతున్నాయి. దీంతో హైదరాబాద్‌తో పాటూ పలు ప్రాంతాల నుంచి వారాంతాల్లో ఇక్కడకు వచ్చే వారికి ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి. ఇటీవలి కాలంలో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. నేరేడుగొమ్ము, చందంపేట ప్రాంతాల్లోని వైజాగ్ కాలనీ, పీఏ పల్లి మండలంలోని అజ్మాపురం ప్రాంతాలకు పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రమాద పరిస్థితులపై సూచిక బోర్డులతో పాటూ పలు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఇద్దరు ఉప ప్రధానార్చకుల బదిలీపై స్టే

భద్రాచలం : దేవాదాయశాఖలోని అర్చకుల బదిలీపై ఇంకా స్పష్టత రాలేదు. తాజా పరిస్థితులను పరిశీలిస్తే.. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోని ఇద్దరు ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, కోటి శ్రీమన్నారాయణాచార్యులు హైకోర్టును ఆశ్రయించడంతో వారిద్దరి బదిలీపై స్టే లభించింది. రామాలయంలో 30 మంది వైదిక ఉద్యోగులకు గాను 20 మంది అర్చకత్వంలో ఉన్నారు. వీరిలో వంశపారంపర్య అర్చకులు 15 మంది. హైకోర్టు స్టే నేపథ్యంలో దేవాదాయశాఖ కౌంటర్ దాఖలు చేయనుందని సమాచారం. ఆయా ఆలయాల సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకొని అర్చకులను బదిలీ నుంచి మినహాయిస్తారా లేదా అన్నది కౌంటర్‌లో వెల్లడించే వీలుంది. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వేద పండితులు, పారాయణదారులు, స్థానాచార్యులు వంటి పోస్టుల్లో ఉన్న వైదిక ఉద్యోగులు స్టే తెచ్చుకున్న వారిని అనుసరించి న్యాయపోరాటం చేస్తారా? లేక ప్రభుత్వ నిర్ణయమే శిరోధార్యం అంటారా అన్నదే ఆసక్తి రేకెత్తిస్తోంది.

భద్రాచలం రామాలయంలో భక్త రామదాసు అనువంశక అర్చకులను ప్రవేశ పెట్టారు. దీన్ని నాలుగు శతాబ్దాలుగా కాపాడుకుంటున్నారు. ప్రధాన కోవెలలోని ధ్రువమూర్తుల పూజలతో పాటు ముఖ్య ఉత్సవాల్లో వీరిదే కీలక పాత్ర. ఇలాంటి చోట అర్చకులను బదిలీ చేయటం సాధ్యమేనా అన్నది ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# కొండెక్కిన కూరగాయలు

ఖమ్మం : కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యవసాయ మార్కెట్ నుంచి ఖమ్మం నగరం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ములుగు, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాపారులు కూరగాయలు కొంటారు. ప్రస్తుతం ఖమ్మం రైతుబజార్లలోనే ఎక్కువ ధరలు పలుకుతుంటే మిగతా ప్రాంతాల్లో చిరువ్యాపారుల దగ్గర మరింత మండిపోతున్నాయి.

వేసవి ప్రభావం వేసవి కారణంగా దిగుబడులు తగ్గిపోవటం ధరలపై కొంత ప్రభావం పడింది. ఖమ్మం టోకు విపణికి సీజన్‌లో రోజుకు 800-900 క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం రోజుకు 400- 500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. వీటిలో కొన్నింటిని ఏపీ, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.

దుంప కూరలూ ఎక్కువే..

కిలో ఆలుగడ్డ రూ.40, చామగడ్డ రూ.46, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.36 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

ఇవి.. కొద్దిగా పర్వాలేదు..

కిలో బెండ రూ.30, దొండ రూ.24, సొరకాయ రూ.30, వంకాయ రూ.18, దోస రూ.30, క్యాబేజి రూ.26.

చిక్కదు గోరుచిక్కుడు..

15 రోజుల క్రితం గోరుచిక్కుడు కిలో ధరలు రూ.26 నుంచి రూ.30 ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.58కి పెరగటంతో వినియోగదారులు కొనలేకపోతున్నారు.

తారెత్తిస్తున్న భగ్గుమంటున్న పచ్చిమిరప

నెల రోజులుగా పచ్చిమిరప ధరలు భగ్గుమంటున్నాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.58 ఉంటే.. ఇప్పుడు మళ్లీ కిలో ధర రూ.70 పలుకుతోంది. అయినా విపణిలో సరకు దొరకటం లేదు. చాలా తక్కువ నిల్వలు ఉంటున్నాయి.

టమాట..

కొద్దినెలల పాటు టమాట ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య స్థిరంగా ఉండేవి. ఇప్పుడు రైతుబజార్లలోనే కిలో రూ.64 వరకు పలుకుతోంది. బహిరంగ విపణిలో చిరు వ్యాపారులు రూ.75కు విక్రయిస్తున్నారు.

కాకరా.. మజాకా..

వారం క్రితం కిలో రూ.30 నుంచి రూ.35 వరకు ఉన్న కాకరకాయల ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. ప్రస్తుతం పొట్టి రకం కిలో ధర రూ.66, పొడవు రకం రూ.70 వరకు పలుకుతోంది.

కొనలేం.. క్యాప్సికం

క్యాప్సికం కిలో ధర రూ.74 వరకు ఉంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల వరకు కిలో రూ.35 నుంచి రూ.45 వరకు ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

వామ్మో బీర

బీరకాయల ధర కిలో రూ.80 వరకు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వీటి ధరలు ఇంతగా ఎన్నడూ పెరగలేదని వాపోతున్నారు. పక్షం రోజుల వరకు కిలో రూ.30లోపు ఉన్న ధరలు విపరీతంగా పెరిగాయి. సరకు సైతం తక్కువగా ఉంది.

ఆకుకూరలూ పిరం..

కొద్దిరోజుల వరకు రూ.10కి 2 కట్టల చొప్పున ఆకుకూరలు విక్రయించారు. ప్రస్తుతం రూ.20కి 2 లేదా 3 కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.70కి చేరింది. గతంలో రోజుకు 60-70 కట్టలు విక్రయించిన వ్యాపారులు ఇప్పుడు 10- 20 మాత్రమే తెస్తున్నారు. ధర ఎక్కువగా ఉండటంతో పాడైపోతాయనే భయంతో తక్కువ మొత్తంలోనే తెచ్చి అమ్ముతున్నారు.

# సీతా రామా ..ఇక వడివడిగా ..!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ఏడేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017లో తొలి అడుగు పడినా.. ఇప్పటికీ ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించటం లేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో పనులను గురువారం పరిశీలించనున్నారు.

రంగంలోకి అమాత్యులు పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తిచేసి సాగునీరందించాలన్నది సర్కారు లక్ష్యం. ఏడేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు పనులు కొలిక్కి రాలేదు. ఆది నుంచే అడ్డంకులు, అవాంతరాలు ఎదురయ్యాయి. భూసేకరణ ప్రక్రియకే దాదాపు రెండేళ్లు పట్టింది. తర్వాత కొవిడ్ మహమ్మారి విజృంభించటంతో పనులు ముందుకు సాగలేదు. తదనంతరం పనులు గాడినపడ్డట్టు అనిపించినా ఆశించిన పురోగతి కనిపించలేదు. 2023లో శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక ఈప్రాజెక్టుపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సమీక్షలు జరిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేయటంతో పనులు మళ్లీ గాడినపడ్డాయి. రాష్ట్రంలో సార్వత్రిక సమరం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగియటంతో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని సీఎం, మంత్రులు ప్రకటించారు. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించనున్నారు. అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఓచోట రిజర్వాయర్ నిర్మించాలని సర్కారు యోచిస్తోంది. 10- 13 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరింది. మంత్రుల తాజా పర్యటనలో రిజర్వాయర్ నిర్మాణంపైనా కీలక నిర్ణయం వెలువడే అవకాశముంది.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం ఖమ్మం జిల్లాలో 4 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. ప్రాజెక్టులో మొత్తం నాలుగు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించారు. ఈ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించారు. భద్రాద్రి జిల్లాలోని 1- 8 ప్యాకేజీల్లో 114 కి.మీ. పొడవు ప్రధాన కాల్వ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. సత్తుపల్లి ట్రంకు పనులను 9-12 ప్యాకేజీలుగా విభజించారు. కాల్వ పొడవు 116 కి.మీ. ఉంటుంది. యాతాకులకుంట టన్నెల్, గండుగులపల్లి వద్ద నాలుగో పంప్‌హౌస్ పనులు సాగుతున్నాయి. పాలేరు ట్రంక్ పనులను 13- 16 ప్యాకేజీల కింద చేపట్టారు. 79 కి.మీ. పొడవు కాల్వలు నిర్మించాల్సి ఉంది.

# ఏపీలో భారీ వర్షాలు.. విపత్కర పరిస్థితుల్లో డ్రోన్ టెక్నాలజీ వాడాలి: సీఎం చంద్రబాబు



అమరావతి: ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో 3 రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. పలు శాఖల అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్, డీజీపీ, మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా దృష్టి పెట్టాలన్నారు. అల్లూరి జిల్లలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన ఘటన జరిగిందన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఘటనకు కారణాలపై విచారణ జరపాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల తీవ్రత దృష్ట్యా మరింత సమర్థంగా పనిచేయాలన్నారు. "వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అప్రమత్తతతో ఉంటే ప్రజల ఇబ్బందులు తగ్గించవచ్చు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెరువుల పరిస్థితిని పరిశీలించాలి. పట్టణాల్లో రోడ్లపై నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలి. జ్వరాల బారిన పడిన గిరిజనులకు వైద్యం అందేలా చూడాలి. కాల్వలు, వాగులను దాటేందుకు ప్రజలను అనుమతించవద్దు. వాట్సాప్ గ్రూపుల ద్వారా సమన్వయంతో పని చేయాలి. విపత్కర పరిస్థితుల్లో డ్రోన్లు వంటి టెక్నాలజీని విరివిగా వాడాలి. భారీ వర్షాలపై ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలి. ప్రభుత్వం ఆదుకుంటుందన్న నమ్మకం కల్పించేలా అధికారులు పనిచేయాలి. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలి. విజయవాడలో ఇంటిపై కొండ చరియలు విరిగిపడటం బాధాకరం. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది" అని చంద్రబాబు తెలిపారు.




అమరావతి: ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విశాఖ నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో విశాఖలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కలెక్టర్ సృజన అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం-కేశ్యాతండా మధ్య వాగులో వరద ఉద్ధృతి పెరిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రకాశం బ్యారేజీలోని మొత్తం 70 గేట్లు ఎత్తి 3,32,374 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలను కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం, యర్రగొండపాలెంలో శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం తోటమూల-వినగడప మధ్య ఉన్న కట్టలేరు వాగుకు వరద పోటెత్తింది. దీంతో సమీపంలోని 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

నందిగామ మండలంలో రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి నల్లవాగు ,వైరా , కట్టలేరు పొంగి ప్రవహిస్తున్నాయి. అడిరావులపాడు గ్రామం వద్ద నల్లవాగు పొంగి రామన్నపేట-నందిగామ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. దాములూరు- వీరులపాడు మధ్య రాకపోకలను అధికారులు నిలిపివేశారు. విజయవాడలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలోని ప్రధాన రహదారులు జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నంలో కూడా భారీ వర్షం పడుతోంది. దీంతో రహదారులపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది.

## వరద ప్రాంతాల్లోని ప్రజలు బయటకు రావద్దు: మంత్రి నారా లోకేశ్




అమరావతి: వరద ప్రాంతాల్లోని ప్రజలు బయటకు రావద్దని మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం, విపత్తు నిర్వహణ శాఖ అలర్ట్ మెసేజ్‌లు గమనించి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొండ చరియలు విరిగిపడే, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తెదేపా నేతలు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించాలని కోరారు. విపత్తుల కష్ట సమయంలో తెదేపా అండగా ఉంటుందనే భరోసా కల్పించాలన్నారు.

## భారీ వర్షాలకు విజయవాడలో నలుగురి మృతి.. పరిహారం ప్రకటించిన సీఎం



విజయవాడ: భారీ వర్షాలకు విజయవాడలోని మొగల్రాజపురంలో ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో నలుగురు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బండరాళ్లు విరిగి ఇళ్లపై పడిన ఘటనలో మేఘన, బోలెం లక్ష్మి, లాలు, అన్నపూర్ణ ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలపై అధికారులతో సీఎం మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న చోట నుంచి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశంపై కసరత్తు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రెండు మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అటు ప్రజలు, ఇటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారుల సూచనలను ప్రజలు పాటించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

## గుంటూరు జిల్లాలో విషాదం.. వాగులో కొట్టుకుపోయిన ముగ్గురి మృతి




పెదకాకాని: గుంటూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పెదకాకాని మండలం ఉప్పలపాడు సమీపంలోని వాగులో ఓ కారు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. నంబూరులోని ఓ పాఠశాలలో ఉప్పలపాడుకు చెందిన రాఘవేంద్ర విధులు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా శనివారం ఉదయం పాఠశాల యాజమాన్యం సెలవు ప్రకటించింది. దీంతో అదే పాఠశాలకు వెళ్లిన ఉప్పలపాడుకు చెందిన ఇద్దరు విద్యార్థులను తీసుకొని రాఘవేంద్ర స్వగ్రామానికి బయల్దేరాడు. మురుగు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నా ఆగకుండా వెళ్లడంతో వరద ఉద్ధృతికి కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో రాఘవేంద్రతోపాటు కారులో ఉన్న విద్యార్థులు సాత్విక్, మానిక్‌లు మృతిచెందారు. స్థానికుల సాయంతో కారుతో పాటు వాగులో కొట్టుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారు.

## వరద ప్రాంతాల్లో సహాయక చర్యలకు ప్రత్యేక బలగాలు: హోంమంత్రి అనిత



అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాలపై హోం, విపత్తు నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. అన్ని జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి వంగలపూడి అనిత ఫోన్‌లో మాట్లాడి సమీక్షించారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని ప్రత్యేక బలగాలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విజయవాడలో కొండచరియలు విరిగిపడి నలుగురు మృతి చెందడంపై హోం మంత్రి విచారం వ్యక్తం చేశారు.

**భారీ వర్షాలపై మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష...** భారీ వర్షాలపై ప్రజల్ని అప్రమత్తం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. విజయవాడలో పలు ప్రాంతాలు నీటమునగడంపై ఆరా తీశారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో నీరు పారేలా అడ్డంకులు తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మ్యాన్ హోల్స్, విద్యుత్ స్తంభాల విషయంలో అప్రమత్తం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులంతా అందుబాటులోనే ఉన్నారని, వర్ష ప్రభావం తగ్గే వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వారితో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు.




## వైసీపీని వీడుతారన్న వార్తలపై తొలిసారిగా స్పందించిన రోజా..

తిరుమల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలయ్యాక మాజీ మంత్రి రోజా అడ్రస్ లేకుండా పోయారు. ఇటీవలి కాలంలో రోజా పార్టీ మారుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఏపీ రాజకీయాలకు శాశ్వతంగా గుడ్ బై చెప్పనున్నారని.. తమిళనాడులో విజయ్ పార్టీలో చేరతారని టాక్ నడుస్తోంది. దీనిపై తొలిసారిగా ఆమె స్పందించారు. తిరుమల శ్రీవారిని రోజా ఇవాళ దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతానని జరుగుతున్న ప్రచారం ఊహాగానమేనన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో మహిళలపై జరిగిన ఘటనల పట్ల ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. ముచ్చుమర్రిలో ఘటన జరిగి 60 రోజులు అవుతున్నా ఆ పాప శవాన్ని ఇంకా కనిపెట్టలేకపోయారని విమర్శించారు. గుడ్లవల్లేరులోని హాస్టల్‌లో హిడెన్ కెమెరాలు పెట్టారంటూ విద్యార్థులు ఫిర్యాదు చేసినా ఏమి జరగలేదని ఎస్పీ చెప్పడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వ హయంలో ర్యాగింగ్ విపరీతంగా పెరిగిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పైన పెట్టిన దృష్టిని పక్కన పెట్టి.. ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంపై దృష్టి సారించాలని రోజా విమర్శించారు. పార్టీలు మారే వారిని ప్రజలు విశ్వసించరని అన్నారు ఎంత మంది పార్టీని వీడినా వైసీపీకి వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో రోజా వారానికోసారి తిరుమలను దర్శించుకునేవారు. పైగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నప్పుడల్లా రాజకీయ విమర్శలను ఎక్కుపెడుతూనే ఉండేవారు. అప్పట్లో రోజాపై తిరుమలలో చేస్తున్న రాజకీయ విమర్శలపై విపరీతంగా ట్రోల్స్ వచ్చాయి. అయినా సరే రోజా ఇప్పటికీ తన తీరును మాత్రం మార్చుకోలేదు. ఓటమి పాలయ్యాక మాత్రం తిరుమలకు రోజా పెద్దగా వచ్చిందే లేదు. ఇన్నాళ్లకు వచ్చి కూడా ఆమె రాజకీయ విమర్శలకు పాల్పడటం పట్ల భక్తుల నుంచి.. రాజకీయ పార్టీల నుంచి ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు భారీ వర్షాల కారణంగా రాష్ట్రమంతా అతలాకుతలమవుతుంటే దానికి సంబంధించి ఊసే లేదు కానీ రాజకీయ విమర్శలేంటని మండిపడుతున్నారు. రోజా ఓటమి పాలైనా కూడా ఆమెకు వివరం మాత్రం రాలేదని అంటున్నారు. మొత్తానికి రోజా అయితే పార్టీ మారే అవకాశమే లేదని తేల్చి చెప్పేశారు.

## భారీవర్షాలు.. ఇబ్బందులుంటే ఒకట్రెండు రోజుల్లో పింఛన్లు పంపిణీ చేయొచ్చు: సీఎం చంద్రబాబు



అమరావతి: ఏపీలో భారీ వర్షాలున్న ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు వెసులుబాటు కల్పించారు. ఆయా ప్రాంతాల్లో ఇబ్బందులుంటే వచ్చే ఒకటి, రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేయవచ్చని చెప్పారు. ఈ విషయంలో సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావద్దని, టార్గెట్ పెట్టవద్దని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలు లేని ప్రాంతాల్లో యథావిధిగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ 2 నుంచి అర్హులైన వారికి కొత్త పింఛన్లు ఇస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. అనర్హుల పింఛన్లు తొలగించాలని యోచిస్తున్నామన్నారు. ఏపీలో పింఛన్ల పంపిణీ వేగంగా సాగుతోంది. ఉదయం నుంచే నగదును లబ్ధిదారులకు అందజేస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలు మినహా ఇతరచోట్ల పంపిణీ చేపట్టారు. సెప్టెంబర్ 1న సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేపట్టారు.




విజయవాడ: భారీ వర్షాలకు విజయవాడలోని మొగల్రాజపురం సున్నపుబట్టి సెంటర్ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.

ఘటన స్థలానికి వెళ్లి విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. ఈ ఘటనలో ఓ ఇల్లు పూర్తిగా దెబ్బతినగా.. మరో మూడు ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. గాయపడ్డ వారిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

వీరిలో ఒక బాలిక మృతి చెందినట్లు సమాచారం. పూర్తిగా దెబ్బ తిన్న ఇంట్లో పలువురు చిక్కుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో అధికారులు అక్కడ సహాయక చర్యలు చేపట్టారు.




## విజయవాడ, గుంటూరులో భారీ వర్షం.. చెరువులను తలపిస్తున్న రహదారులు

విజయవాడ: భారీ వర్షాలు విజయవాడ, గుంటూరు నగరాలను అతలాకుతలం చేశాయి. ఎడతెరిపిలేని వర్షంతో పలు చోట్ల రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. విజయవాడలోని విద్యాధరపురం, ఆర్ఆర్ నగర్‌లో రహదారులు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరింది. విజయవాడ బస్టాండ్ పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామవరప్పాడు రింగ్‌రోడ్ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నిడమానూరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు మొగల్రాజపురం సున్నపుబట్టి సెంటర్ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ కింద భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. విజయవాడలోని దుర్గగుడి ఫ్లై ఓవర్‌ను తాత్కాలికంగా మూసివేశారు. బ్రిడ్జి దగ్గర వర్షపు నీరు నిలవడంతో.. మూడు బస్సులు, ఒక లారీ అందులో చిక్కుకున్నాయి. భారీ వర్షాలకు గుంటూరు నగరంలో గడ్డిపాడు చెరువు పొంగిపొర్లుతోంది. దీంతో సమీపంలోని ఇళ్లలోకి నీరు చేరింది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. మంగళగిరి టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటితో ఆ ప్రాంతం జలాశయంలా కనిపిస్తోంది. దీంతో గుంటూరు-విజయవాడ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని ప్రయాణాలు అపుకోవాలని అధికారులు సూచించారు. భారీ వర్షం కారణంగా గుంటూరు ఆటోనగర్, పెద్దకాకాని పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదాకాకాని మండలం నంబూరు చెరువు పొంగడంతో గ్రామంలోని ఇళ్లలోకి నీరు చేరింది. వీధులు జలమయమయ్యాయి.

# టిల్లు గాని గాళ్ వేడి మీద ఉందిలే

'డీజే టిల్లు' లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రంలో నటించింది నేహా శెట్టి. అంతకుముందు పూరి వారసుడితో 'రొమాంటిక్'లో నటించినా కానీ 'డీజే టిల్లు' విజయం గేమ్ ఛేంజర్ గా మారింది. నేహా రేంజును ఈ చిత్రం అమాంతం పెంచింది. అటుపై నేహా శెట్టి వరుస చిత్రాలకు సంతకాలు చేసింది. ఇటీవల 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో అద్భుత నటనతో ఆకట్టుకుంది. ఈ భామ క్యూట్ లుక్స్, మతి చెడే బోల్డ్ ఫ్యాషన్ సెన్స్ యువతరానికి ఇప్పటికే కనెక్టయిపోయింది. తాజాగా టిల్లు గాని బ్యూటీ లైట్ బ్లూ మినీ డ్రెస్ లో ఫోజులివ్వగా అవి ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. నీలిరంగు డిజైనర్ దుస్తుల్లో నేహా ఎంతో వేడిగా కనిపిస్తోంది. నేహా శెట్టి టోన్డ్ ఫిజిక్ కి సరిపడే డిజైనర్ లుక్ ఇది. మేకప్ లెస్ లుక్ లో శెట్టి ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. ఈ



ఆకర్షణీయమైన ఫోటోషూట్ సోషల్ మీడియాల్లో వైరల్‌గా మారుతోంది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్‌కి నేహా అద్భుతమైన క్యాప్షన్‌ని ఇచ్చింది. ''కాంతులను పట్టుకోవడం.. రాత్రులను సొంతం చేసుకోవడం" అంటూ రిథమిక్ గా శీర్షికను జోడించింది. నేపథ్యంలో పబ్ వాతావరణం చూస్తుంటే ఎంతో చిల్లింగ్ గా కనిపిస్తోంది. యువనటి స్పీడ్ కి తగ్గట్టుగా ఈ ఫోటోషూట్ అద్భుతంగా కుదిరింది. టిల్లు గాని గాళ్ వేడి మీద ఉందిలే అంటూ అభిమానులు దీనిపై వ్యాఖ్యానిస్తున్నారు.

**కన్నడలో మళ్లీ స్పీడ్ :** నేహా శెట్టి టాలీవుడ్ తో పాటు శాండల్వుడ్ లోను పాపులర్ కథానాయిక. ఇప్పటికే పలు కన్నడ చిత్రాల్లోను ఈ బ్యూటీ నటించింది. తాజా కథనాల ప్రకారం.. నేహా శెట్టి దర్శకనటుడు, 'కాంతార' ఫేం రిషబ్ శెట్టితో కలిసి నటించనుందని గుసగుస వినిపిస్తోంది. ఇంతకుముందు ఒక యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో రిషబ్ శెట్టితో కలిసి పనిచేయాలని ఆత్రంగా ఉన్నానని వ్యాఖ్యానించింది. రిషబ్ శెట్టి కాంతారా చిత్రాన్ని తాను వందల సార్లు చూశానని కూడా వెల్లడించింది. ఇంతలోనే శెట్టి తన తదుపరి చిత్రానికి ఈ బ్యూటీని ఎంపిక చేయనున్నారని గుసగుస వినిపిస్తోంది.

# 18 ఏళ్ల వయసులో చీవాట్లు తిన్న సుస్మితాసేన్!

తాలీ లాంటి సక్సెస్ ఫుల్ సిరీస్ తర్వాత మాజీ విశ్వ సుందరి సుస్మితా సేన్ బాలీవుడ్ లో ఫుల్ బిజీ అవ్వడం ఖాయమనుకున్నారంతా. కానీ ఆమె కెరీర్ అలా కనిపించలేదు. తాలి హిట్ అందుకుని ఏడాది సమీపిస్తున్నా ఇంత వరకూ కొత్త ప్రాజెక్ట్ కి సైన్ చేసింది లేదు. అటు సినిమాలు చేయలేదు. ఇటు కొత్త సిరీస్ లకు సైన్ చేసింది లేదు. కానీ ఎఫైర్ల వార్తలతో మాత్ర నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. లలిత్ మోదీతో బ్రేకప్ తర్వాత మళ్లీ పాత బోయ్ ఫ్రెండ్ కే దగ్గరవుతుందని ప్రచారం సాగింది. ఇద్దరు జంటగా కనిపించిన సందర్భాలతో అది స్నేహమా? రిలేషన్ షిప్ నా? అన్నది మరో డౌట్ గా మారింది. అదంతా పక్కనబెడితే నేటి సమాజం తీరును..నాటి సమాజం తీరును సరిపోల్చుతూ 18 ఏళ్ల వయసులో వాడిన అసభ్య పదజాలన్ని గుర్తు చేసుకుంది సుస్మితా సేన్. ఆ రోజుల్లో సమాజం ఇప్పటిలా ఓపెన్ గా లేదు. ఏం చెప్పాలన్నా సంకోచించేవారు. 18 ఏళ్ల వయసులో శోభా దేతో ఇంటర్వ్యూ సందర్భంగా ఉద్దే




శపూర్వకంగానే ఓ బూతు పదం తీసుకొచ్చా.

ఎందుకంటే ఓ మనిషిగా నిజమైన స్వేచ్ఛ కావాలనుకున్నాను. ఆ ప్రయత్నంలోనే భారతదేశపు మొట్ట మొదటి మిస్ యూనివర్స్ అయ్యా. కానీ ఆ పదం వాడినందుకు ఇంటికెళ్లిన తర్వాత అమ్మ-నాన్న హెచ్చరించారు. నేను వాడిన పదజాలం వాళ్లకు ఎంత మాత్రం నచ్చలేదు. నీ భుజాలపై పెద్ద బాధ్యత ఉంది. అలాంటి బూతు పదం ఇంటర్వ్యూలో ఎందుకు మాట్లాడావు అని దండించారు. శోభా దే మీ గురించి చెడుగా రాస్తున్నారని చెప్పారు. దీంతో నేను ఆశ్చర్యపోయాను. స్వేచ్ఛ అనే విషయంలో నేను పూర్తిగా ఛాన్స్ తీసుకున్నాను అనిపించింది అని తెలిపింది.




# 'దేవర'కి ఆ హాలీవుడ్ సినిమా నుంచి థ్రెట్!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తోన్న దేవర మొదటి భాగం రిలీజ్ డేట్ పాన్ ఇండియాలో ఫిక్సైన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 27న చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేస్తున్నారు. ఆర్ ఆర్ ఆర్ తర్వాత తారక్ నుంచి భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకొస్తున్న సినిమా ఇదే. తెలుగు సహా కన్నడలో తారక్ ఇమేజ్ కి తిరుగు లేదు. తారక్ ఇమేజ్..కొరటాల సెన్సిబిలిటీ వర్కౌట్ అయిందంటే వసూళ్లతో బాక్సాఫీస్ షేక్ అవుతుంది.

అందులో ఎలాంటి డౌట్ లేదు. హిందీలో సైతం ఇదే దూకుడుతో మార్కెట్ లోకి వస్తోంది. ఇప్పటికే భారీ ఎత్తున అన్ని భాషల్లోనూ ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగింది. ఇంతవరకూ దేవర సేఫ్. అయితే నార్త్ నుంచి దేవరకి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం కనిపిస్తుంది. అక్టోబర్ 4న హాలీవుడ్ చిత్రం జోకర్ -2 కూడా భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. జోకర్ ఫ్రాంచైజీ కి ఇండియాలో భారీ ఫాలోయింగ్ ఉంది. మొదటి భాగం జోకర్ ఇండియన్ బాక్సాఫీస్ ని వసూళ్లతో షేక్ చేసింది. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన సినిమా సంచలన వసూళ్లు సాధించింది. 2019 లోనే జోకర్ 70 కోట్ల వసూళ్లు ఇండియా మార్కెట్ నుంచి రాబట్టింది.

అప్పటి నుంచి నార్త్ ఆడియన్స్ లో జోకర్ ఓ బ్రాండ్ గా మారింది. ఈనేపథ్యంలో ఇండియాన్ బాక్సాఫీస్ వద్ద జోకర్ -2 టార్గెట్ 150 కోట్లపైనే ఉంటుంది. అదే టార్గెట్ గా ఇండియాలో రిలీజ్ ప్లాన్ చేసి దిగుతున్నారు. దీంతో ఈ ప్రభావం దేవరపై ఉంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అప్పటికే దేవర రిలీజ్ అయి వారం సమీపిస్తుంది. ఈ లోపు ఆ సినిమా కి మంచి టాక్ వస్తే రాబట్టాల్సిన వసూళ్లు రాబడుతుంది. అందులో ఎలాంటి డౌట్ లేదు. ఒకవేళ జోకర్-2 హిట్ టాక్ తెచ్చుకుంటే గనుక దేవర వసూళ్లు పై కొంత ప్రభావం పడుతుంది.

# బెల్లంకొండ కొత్త మూవీ.. బాబు మళ్లీ స్పీడ్ పెంచాడు



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్.. కొన్ని నెలలుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నారు. ఎలా అయినా హిట్ కొట్టాలనే పట్టుదలతో కథలు సెలెక్ట్ చేసుకుంటున్నారు. టైసన్ నాయుడు మూవీని పూర్తి చేస్తున్న సాయి శ్రీనివాస్.. ఇటీవల కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో మరో సినిమా స్టార్ట్ చేశారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా సాయి శ్రీనివాస్ మరో కొత్త మూవీ అనౌన్స్మెంట్ వచ్చేసింది. లెజెండరీ డైరెక్టర్ కోడి రామకృష్ణ 75వ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ సినిమాను అనౌన్స్ చేశారు మేకర్స్. కొత్త డైరెక్టర్ లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని మూన్ షైన్ పిక్చర్స్ బ్యానర్ పై మహేష్ చందు నిర్మిస్తున్నారు. మూవీని ప్రకటిస్తూ స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోస్టర్ లో హీరో పురాతన ఆలయం ముందు నిలబడి దీర్ఘంగా చూస్తున్నారు. టెంపుల్ పై సూర్యకిరణాలు పడడంతో పోస్టర్ అంతా డివోషనల్ వైబ్ తో ఆకట్టుకుంటోంది. సాయి శ్రీనివాస్ తుపాకీ పట్టుకుని గుడి వైపు చూస్తూ రాళ్లపై నిలుచున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంతో సూపర్ నేచురల్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ మూవీలో సాయి శ్రీనివాస్ ను ఇప్పటి వరకు ఎవరూ చూడని అవతార్ లో మేకర్స్ చూపించనున్నారట. కమర్షియల్ అంశాలతో కూడిన ఇంట్రెస్టింగ్ అండ్ పవర్ ఫుల్ స్క్రిప్ట్ ను సినిమా కోసం దర్శకుడు లుధీర్ బైరెడ్డి సిద్ధం చేశారు. భారీ బడ్జెట్ తోపాటు అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు మేకర్స్. సాయి శ్రీనివాస్ కెరీర్ లో హైయెస్ట్ బడ్జెట్ మూవీగా శివన్ రామకృష్ణ సమర్పిస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఒక షెడ్యూల్ పూర్తి కూడా అయింది. బుధవారం నుంచి రెండో షెడ్యూల్ స్టార్ట్ కానుంది. ఈ సినిమాకు గాను.. ప్రముఖ టెక్నీషియన్లను రంగంలోకి దించారు మేకర్స్. శివేంద్ర కెమరామ్యాన్ గా వ్యవహరిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. కార్తీక్ శ్రీనివాస్ ఎడిటర్ గా, శ్రీ నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. పాన్ ఇండియా లెవల్ లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఫస్ట్ పోస్టర్ తో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ మూవీతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఎలాంటి విజయం అందుకుంటారో వేచి చూడాలి.

# కేతిక పాప.. అలా ముద్దుగా..

యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన కేతిక శర్మ, మోడలింగ్ ద్వారా సినిమా రంగంలోకి ప్రవేశించింది. ఆకాష్ పూరి సరసన 'రొమాంటిక్' సినిమాతో హీరోయిన్‌గా అడుగుపెట్టిన కేతిక, మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. సినిమాలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా గ్లామర్ రోల్స్‌లో తన సొగసులతో ఆకర్షణీయంగా కనిపించింది. ఆ సినిమా అనంతరం కేతికకు కొత్త అవకాశాలు వచ్చాయి. నాగ శౌర్యతో 'లక్ష్య' సినిమాతో పాటు వైష్ణవ్ తేజ్ సరసన 'రంగ రంగ వైభవంగా'లో నటించింది. అయితే, ఈ రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో కేతికకు పెద్దగా గుర్తింపు రాలేదు. అయినప్పటికీ, తన అందం, యాక్టింగ్ ప్రతిభతో కుర్రతరం మనసులు గెలుచుకుంటూనే ఉంది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్, సాయి తేజ్ నటించిన 'బ్రో' సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. ఈ చిత్రం



కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించినప్పటికీ, కేతికకు ఆశించినంత గుర్తింపు మాత్రం రాలేదు. అయినప్పటికీ, సోషల్ మీడియాలో ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం కేతిక తనకు సరైన అవకాశాలు రావాలని ఎదురు చూస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, కొత్త ఫోటోషూట్లను పంచుకుంటూ, ఫాలోవర్స్‌ను ఆకట్టుకుంటోంది. త్రోబ్యాక్ ఫోటోలు, స్టైలిష్ లుక్స్ తో ఆమె ఆకట్టుకుంటోంది. రీసెంట్ గా అమ్మడు మరోసారి స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. పెదవులు రౌండ్ గా చేసి తన కురులను అలా వదిలేసింది. ఫ్రేమ్ లో అమ్మడు ఎంతో చూడముచ్చటగా ఉందని ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. టాలీవుడ్‌లో మంచి బ్రేక్ కోసం కేతిక ఎదురుచూస్తున్న ఈ సమయంలో, తన టాలెంట్‌ను చూపించేందుకు అమ్మడు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఆ మధ్య ఒక కోలీవుడ్ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు చెప్పింది. అలాగే వెబ్ సిరీస్ లు కూడా చేయనున్నట్లు కేతిక వివరణ ఇచ్చింది. కానీ వాటిపై అఫీషియల్ గా ఎలాంటి అప్డేట్స్ లేవు. మరి రాబోయే రోజుల్లో ఈ బ్యూటీ ఎలాంటి పాత్రల్లో కనిపిస్తుందో చూడాలి.

# భారతదేశపు అత్యంత సంపన్న కథానాయిక

స్టార్ హీరోల ఆదాయంతో పోలిస్తే కథానాయికల ఆదాయం చాలా తక్కువ. పరిశ్రమ ఏదైనా కానీ ఏలేది హీరోలే. హీరోయిన్ల ముఖ విలువ మార్కెట్ రేంజ్ తక్కువ. గ్లామర్ రంగంలో ఇది విచిత్రమైన పరిస్థితి. ఆర్జన పరంగా హీరోలకు ధీటుగా హీరోయిన్లు సంపాదించడం అనేది అరుదు. కానీ చాలా మంది నటీమణులు ఇప్పుడు అగ్ర హీరోల కంటే ధనవంతులుగా ఉన్నారు. భారతదేశానికి చెందిన అత్యంత ధనిక నటి నిజానికి తన భర్త కంటే మూడు రెట్లు ధనవంతురాలు. తన భర్త కంటే చాలా మంది హీరోల కంటే పెద్ద స్టార్. తన ఆస్తి విలువ ఏకంగా రూ. 862 కోట్లు. హీరో అయిన తన భర్త కంటే మూడు రెట్లు ఎక్కువ రూ. 862 కోట్ల (105 మిలియన్ల డాలర్లకు పైగా) నికర ఆస్తి విలువతో ఐశ్వర్య రాయ్ భారతదేశంలో అత్యంత ధనిక నటిగా ఉన్నారు. చాలామంది తన సహచరులు, జూనియర్ల కంటే ధనికురాలు. ఆదాయ ఆర్జనలో దశాబ్దాలు హవా సాగించిన నటి. భారతదేశంలోని ఇతర సంపన్న నటీమణులంతా తన కంటే చాలా కింది స్థాయిలో ఉన్నారు. అనేక మిలియన్ డాలర్ల



అంతర్జాతీయ బ్రాండ్ డీల్‌లతో పాటు బాలీవుడ్, తమిళ సినిమా, హాలీవుడ్‌లో ఐశ్వర్యారాయ్ హిట్ సినిమాల్లో నటించింది. ఐశ్వర్య ఒక్కో సినిమాకు 10-15 కోట్లు తీసుకుంటుందని సమాచారం. గత సంవత్సరం తమిళ బ్లాక్‌బస్టర్ రెండు భాగాల పొన్నియిన్ సెల్వన్ కోసం 15 కోట్ల రూపాయలు వసూలు చేసింది. బ్రాండ్ షూట్‌ల కోసం రోజుకు 6-7 కోట్లు సంపాదిస్తుంది. భర్త అభిషేక్ బచ్చన్ కంటే ఐశ్వర్యరాయ్ మూడు రెట్లు ధనవంతురాలు. ఐశ్వర్య రాయ్ రూ. 862-కోట్ల నికర ఆస్తులతో దేశంలో నంబర్ వన్ హీరోయిన్ గా వెలుగొందుతున్నారు. భారతదేశంలో అత్యంత ధనిక నటిగా మాత్రమే కాకుండా భారతదేశంలోని అనేక మంది హీరోల కంటే ధనవంతురాలిగా హెూదాను కలిగి ఉన్నారు. తన భర్త అభిషేక్ బచ్చన్ కంటే మూడు రెట్లు ధనవంతురాలు. అభిషేక్ నికర ఆస్తుల విలువ రూ. 280 కోట్లు. భారత దేశ అగ్ర హీరోలు రణబీర్ కపూర్ -రూ. 345 కోట్లు, ప్రభాస్ -రూ. 200 కోట్లు, రణ్‌వీర్ సింగ్ (రూ. 500 కోట్లు) నికర ఆదాయాలను కలిగి ఉన్నారు. వారి కంటే ఐష్ రేంజ్ ఎక్కువ. ప్రియాంక చోప్రా-రూ. 650 కోట్లు, అలియా భట్ రూ. 550 కోట్లు, దీపికా పదుకొనే రూ. 500 కోట్లు, కరీనా కపూర్ రూ. 485 కోట్లు, కత్రినా కైఫ్ రూ. 250 కోట్లు, నయనతార రూ. 200 కోట్లు ఆర్జనతో మెరుస్తున్నారు. వీరందరి కంటే కూడా ఐశ్వర్యారాయ్ ఆస్తి విలువ చాలా ఎక్కువ.

గరుడ వార్త






రష్యా తూర్పు ప్రాంతంలోని కమ్‌చత్కా ద్వీపకల్పంలో 22 మందితో ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అదృశ్యమైంది. వీరిలో 19 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఈ విషయాన్ని ఫెడరల్ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీ కూడా ధ్రువీకరించింది. ఎంఐ-8టీ శ్రేణికి చెందిన ఈ హెలికాప్టర్ వచ్కజెట్స్ అగ్ని పర్వతం సమీపం నుంచి బయల్దేరింది. కానీ, గమ్యస్థానానికి చేరలేదు. అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ డబుల్ ఇంజిన్ హెలికాప్టర్‌ను 1960ల్లో డిజైన్ చేశారు. ఈ మోడల్‌ను రష్యా, పొరుగు దేశాల్లో అత్యధికంగా వినియోగిస్తుంటారు.

ఈ ఏడాది ఆగస్టులో కూడా కమ్‌చత్కాలో ఇటువంటి హెలికాప్టరే 16 మంది ప్రయాణికులతో సహా కుప్పకూలిపోయింది. ఈ హెలికాప్టర్‌ను విట్యజ్ ఏరో కంపెనీ నిర్వహిస్తోంది. ఈ హెలికాప్టర్ నాడు మాస్కో నుంచి పర్యటకులను సెయింట్ పీటర్స్ బర్గ్‌కు తరలిస్తోందని ప్రభుత్వ రంగ న్యూస్ ఏజెన్సీ ఆర్ఐఏ పేర్కొంది.




## జూరాల జలాశయానికి పోటెత్తిన వరద.. 45 గేట్లు ఎత్తివేత

గద్వాల : మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ప్రవాహం పెరగడంతో గద్వాల జిల్లా జూరాల జలాశయానికి 3.21 లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. దీంతో జలాశయం 45 గేట్లు ఎత్తి దిగువకు 3.5 లక్షల క్యూసెక్కులు, జల విద్యుత్ కేంద్రం ద్వారా 19 వేల క్యూసెక్కుల చొప్పున.. మొత్తం 3.26 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.65 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.97 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల జలాశయం కింద ఉన్న కుడి, ఎడమ కాలువలతోపాటు నెట్టెంపాడు, బీమా కోయిల్ సాగర్ నుంచి సాగు నీటి కోసం నీటిని విడుదల చేస్తున్నారు.

## హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్ వే: సీఎం రేవంత్



హైదరాబాద్: తెలంగాణలో బౌద్ధ పర్యాటక స్థలాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో అంతర్జాతీయ మ్యూజియం ఏర్పాటు చేయాలని, బ్యాక్ వాటర్ వరకు బోటింగ్‌ను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకుంది. ఫణిగిరి, నేలకొండపల్లి టూరిజం సర్క్యూట్, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్ వే ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ మధ్య నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదన తీసుకొచ్చారు.




హైదరాబాద్: నగర పరిధిలోని చెరువుల్లో అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు చేపట్టారు. ఆరుగురు అధికారులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. హైడ్రా ఫిర్యాదుతో సైబరాబాద్ ఆర్థిక నేర విభాగంలో కేసులు నమోదయ్యాయి. నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, చందాపేట జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుదామ్ష్, బాచుపల్లి తహసీల్దార్ పూల్ సింగ్, మేడ్చల్-మల్కాజిగిరి ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్, హెచ్ఎండీఏ సిటీ ప్లానర్ రాజ్‌కుమార్‌పై కేసులు నమోదయ్యాయి. మరోవైపు నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి.

## గోదావరిఖనిలో రూరల్ టెక్నాలజీ సెంటర్: మంత్రి శ్రీధర్‌బాబు



గోదావరిఖని: సింగరేణి ప్రజలు ఎంతో కష్టపడి పనిచేస్తేనే.. దేశం, రాష్ట్రంలో వెలుగులు ఉంటాయని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గోదావరిఖనిలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. రూ.8వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. "ఈ ప్రాంత యువతకు ఉపయోగపడేలా నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం, దీనికి కోసం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఎంతో కృషి చేశారు. వచ్చే ఏడాది వెయ్యి మందికి శిక్షణ ఇచ్చేలా ఈ సెంటర్‌ను అభివృద్ధి చేస్తాం. గత తొమ్మిదేళ్లలో రైతులు, సింగరేణి కార్మికులకు దగా జరిగింది. చెప్పినమాట ప్రకారం ఆగస్టు 15 నాటికి రూ.2లక్షలలోపు ఉన్న రుణాలు మాఫీ చేశాం. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా మాఫీ జరగకపోతే సరిచేసి పూర్తి చేస్తాం. రుణమాఫీ జరగలేదని భారాస నాయకులు రెచ్చగొడుతున్నారు. రుణమాఫీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.. రైతులు ఆందోళన చెందవద్దు"అని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసింది: ఎమ్మెల్యే కేటీఆర్..




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాంగ్రెస్ సర్కార్ అస్తవ్యస్తం చేసిందని బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యార్థులు లేరంటూ 1,864 ప్రభుత్వ పాఠశాలలు మూసేసే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆయన అన్నారు.

**విద్యాశాఖ మంత్రిని నియమించాలి..** ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల నియామకం, మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ఆహారం అందించటంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ప్రమాదం అంచున ప్రభుత్వ విద్య ఉందని చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిస్థితులు మంచివి కావని హితవుపలికారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు విద్యావేత్తలు, మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**పేదలు చదువుతున్నారనే నిర్లక్ష్యం..** తెలంగాణలో గురుకుల పాఠశాల వ్యవస్థను కనుమరుగు చేసే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురుకుల పాఠశాలల్లో ఇప్పటివరకు 34మంది విద్యార్థులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. పేదపిల్లలు చనిపోతే కాంగ్రెస్ సర్కార్‌కు పట్టింపే లేదని ధ్వజమెత్తారు. పాలమాకులలో పిల్లలు కారం తిండి తినలేక రోడ్డెక్కారని మండిపడ్డారు. ఇలాంటి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని, గురుకులాల్లో మౌలిక సదుపాయాలపై రివ్యూ చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. గురుకులాల్లో నాణ్యమైన తిండి పెట్టడం లేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలు చదువుతున్నారనే నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహించారు. సీఎం రేవంత్ రెడ్డి బడాయి మాటలు చెప్పడం తప్ప చేతలు మాత్రం లేవని ధ్వజమెత్తారు.

## సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లపై హరీష్‌రావు సంచలన విమర్శలు



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీమంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. సాగునీటి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్‌రావు కౌంటర్ ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్‌ను డెకాయిట్ అని మంత్రి ఉత్తమ్ సంభోదించడం ఆయన దిగజారుడు మనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. బూతులు మాట్లాడటంలో, అన్ పార్లమెంటరీ భాషను ఉపయోగించడంలో ముఖ్యమంత్రి రేవంత్?కు తానేమి వెనుకబడలేనని నిరూపించాలనుకున్నావా ఉత్తమ్..అని ప్రశ్నించారు. పేరేమో ఉత్తమ్ కుమార్.. మాట తీరేమో మూసీ ప్రవాహం అని విమర్శలు చేశారు.

**ప్రక్షాళన చేయాలి..** "రేవంత్ నోటితో పాటూ ఉత్తమ్ నోరు కూడా ప్రక్షాళన చేయాల్సి ఉంది. జలయజ్ఞంలో ఈపీసీ కాంట్రాక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టి ఇష్టమున్నట్లు ప్రాజెక్టుల అంచనా విలువలను పెంచేసి, ఏజెన్సీలకు మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టి, నిబంధనలకు విరుద్ధంగా సర్వే, డిజైన్ అడ్వాన్స్‌లను 0.5 శాతం నుంచి 3.5 శాతానికి పెంచుకొని రాష్ట్రాన్ని డెకాయిట్ చేసింది ఎవరు ? వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నదెవరు ? మీరు కాదా ఉత్తమ్? ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.17 వేల కోట్ల నుంచి తట్ట మట్టి ఎత్తకుండానే రూ.40 వేల కోట్లకు పెంచుకున్న సంగతిని మరచిపోయావా ఉత్తమ్.. ఇగో మీ కాంగ్రెస్ డెకాయిట్ గురించి ఇప్పటికే ఎన్నోసారు చెప్పి ఉన్నా. మళ్లీ గుర్తు చేస్తున్నాను" అని హరీష్‌రావు తెలిపారు.

**అడ్వాన్స్ లు దండుకున్నారు..** "తొలుత జీఓ నంబరు 124 తేదీ 16.05.2007 ద్వారా రూ.17,875 కోట్లకు ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి మంజూరు చేసి ఆ తర్వాత 19 నెలల్లోనే పనులు మొదలు కాకుండానే జీఓ నంబరు 238 తేదీ 17.12.2008 ద్వారా రూ.38,500 కోట్లకు పరిపాలనా అనుమతిని సవరించింది మీరు మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? తుమ్మిడిహట్టి బ్యారేజి నిర్మాణానికి మహారాష్ట్రతో ఎటువంటి ఒప్పందం చేసుకోకుండానే ప్రాజెక్టు పనులని 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు ఖరారు చేసి తలను వదిలేసి తోక దాకా ఏక కాలంలో పనులని ప్రారంభింపజేసి అడ్వాన్స్ లు దండుకున్నది మీరు కాదా? 2010లో కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ ని రూ.40,300 కోట్లకు సవరించి పంపింది నువ్వు మంత్రిగా ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా" అని హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

## ఆడపిల్లలు దు:ఖాన్ని ఆపులేకపోతున్నారు... మొద్దు నిద్ర వీడండి



రంగారెడ్డి, ఆగస్టు 31: జిల్లాలోని పాలమాకుల గురుకుల పాఠశాలను మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ.. ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తే ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. " ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు. ప్రతిపక్షాల మీద విమర్శ చేయడం తప్ప పాలన మీద దృష్టి లేదు. గురుకులాల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోయే పరిస్థితి. మీకు చీమ కుట్టినట్లు అయినా లేదు. సిగ్గుచేటు ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్. నువ్వు పూర్తిగా విఫలం అయ్యావు" అంటూ విరుచుకుపడ్డారు. పిల్లలు రోడ్డు మీదకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తుంటే బాధ తెల్సుకోవాలని వచ్చానని.. దుఃఖాన్ని ఆపుకోలేక పోతున్నారని అన్నారు. భయంతో వణికిపోతున్నారన్నారు. కర్రలు విరిగేలా కొడుతున్నారని ఏడుస్తున్నారని తెలిపారు. ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారని.. రెండో జత ఇవ్వలేదు అంటున్నారన్నారు. పుస్తకాలు కూడా ఇవ్వని పరిస్థితి ఉందని మండిపడ్డారు. కేసీఆర్ సన్నబియ్యంతో అన్నం పెడితే మీరు గొడ్డు కారంతో పెడుతున్నరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. 500 మంది ఆసుపత్రుల పాలయ్యారన్నారు. 38 మంది చనిపోయారన్నారు. పాములు కరిచి చనిపోతున్నారని.. ఎలుకలు కొరికి ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ఒకప్పుడుగురుకులాల్లో చదవటం కల అని.. ఇప్పుడు ఆవేదన చెందుతున్నారన్నారు. కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. "ఇక్కడ ఉన్న టీచర్లను మార్చండి. మంచి భోజనం పెట్టండి" అని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి విద్యా శాఖా మంత్రిగా ఉన్నారని... మైనార్టీ గురుకులాలు జనవరి నుంచి మెస్ బిల్లులు ఇవ్వలేదన్నారు. అన్ని గురుకులాల్లో కాస్మొటిక్ చార్జెస్, కరెంటు బిల్లులు, మెస్ బిల్లులు రావడం లేదని.. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి తక్షణం చర్యలు తీసుకోవాలని హరీష్ రావు హితవుపలికారు.

**గురుకులాలను గాలికి వదిలేశారు: సబిత** – గురుకులాలను గాలికి వదిలేశారని మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా శాఖను పట్టించుకోవడం లేదన్నారు. ఎవరు ఏం అడిగిన పట్టించుకునే వారు లేరన్నారు. సీఎం ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. సమీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదని అడిగారు. అసెంబ్లీలో అడిగినా సమాధానం లేదని... ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సింగరేణి - జెన్‌కో ఆధ్వర్యంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు: భట్టి విక్రమార్క



రామగుండం: కరీంనగర్ జిల్లాలోని రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయాలన్న నిర్ణయానికి వచ్చామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితో సైతం చర్చించామన్నారు. రామగుండంలో బి పవర్‌హౌస్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల్లోనే పవర్ ప్రాజెక్టుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. సింగరేణి – జెన్‌కో జాయింట్‌గా పవర్ ప్రాజెక్టును ప్రారంభించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. అందరి కోరిక మేరకు బి పవర్ హౌస్ పవర్ ప్రాజెక్టును ముందుకుతీసుకెళ్తామని తెలిపారు. "అతి త్వరలోనే పవర్ ప్రాజెక్టు టెండర్లు పిలుస్తాం. భూ సేకరణపై ప్రతిపాదన త్వరగా పంపించాలని అధికారులను కోరాం. 50 సంవత్సరాలుగా ఈ ప్రాంతం వెలుగునిచ్చింది. సాగునీటిని కూడా తీసుకువచ్చింది. ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు పవర్ ప్రాజెక్ట్‌ను విస్తరించాలని నా దృష్టికి తీసుకువచ్చారు. రామగుండం సమస్యలపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తున్నారు. ఇక్కడ నెలకొల్పిన జెన్‌కో విద్యుత్ కర్మాగారం జీవితకాలం పూర్తయింది. జెన్‌కో ప్లాంట్‌తో ఇక్కడి ప్రజలకు విడదీయలేని బంధం ఉంది. సింగరేణి కార్మికులకు రూ.కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాం. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి నియోజకవర్గ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. పత్తిపాక రిజర్వాయర్ కోసం బడ్జెట్ కేటాయించాం. ఎల్లంపల్లి భూనిర్వాసితుల పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## ఎమ్మెల్యేనే గుర్తుపట్టని పోలీసులు.. మండిపడి, అవమానభారంతో వెనుదిరిగి...

నకిరేకల్: ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేనే పోలీసులు గుర్తుపట్టకపోవడం నల్గొండలో చర్చనీయాంశం అవుతోంది. శుక్రవారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన నిమిత్తం మంత్రులు సహా ఉమ్మడి నల్గొండ జిల్లాకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు భువనగిరికి వెళ్లారు. ఈ క్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి(%ఎవఎబశ్రీఖ ఎవవతీవంష్టుఎ%) చేదు అనుభవం ఎదురైంది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిన్న భువనగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నీటిపారుదల శాఖ పనులపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. వారంతా ప్రత్యేక హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే మంత్రులకు స్వాగతం పలికేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు క్యూ కట్టారు. అయితే వారికి స్వాగతం పలికేందుకు హెలిప్యాడ్ వద్దకు వెళ్లిన వేముల వీరేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే.. పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను గుర్తుపట్టే స్థాయిలో పోలీసులు లేరా? అంటూ ఆగ్రహించారు.

**సముదాయించినా వినకుండా..** అయితే భద్రత తనిఖీ విభాగం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఎమ్మెల్యేని గుర్తుపట్టలేదని తెలిసింది. మంత్రులకు స్వాగతం పలికేందుకు వెళ్లగా.. ఆయన్ని గేటు వద్దే అడ్డుకున్నారు. బయటి వ్యక్తులకు లోపలికి వెళ్లనిచ్చేది లేదని తేల్చిచెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం కట్టలు తెంచుకుంది. చేసేదేమీ లేక.. తాను ఎమ్మెల్యేనని పోలీసులకు చెప్పుకోవాల్సి వచ్చింది. ఈ అవమానంతో వీరేశం అక్కడి నుంచి అలిగి వెళ్లిపోవాలనుకున్నారు. అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి కలగజేసుకుని సముదాయించే ప్రయత్నించారు. 'పోలీసులకు కామన్‌సెన్స్ ఉండదా. ఎవరు ఎమ్మెల్యేనో.. ఎవరు కాదో తెలియదా..?' అని వీరేశం విరుచుకుపడ్డారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com